# సూర్యసేన

3rd ANNIVERSARY

Estd:2023

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

RNI. NO.: TELTEL/2023/85598

www.sooryasena.com






ఆదివారం SUNDAY || 20.09.2026 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 4 సంచిక (Issue) : 19 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah


## పర్యావరణ పరిరక్షణతోనే ఆర్థిక ప్రగతి..

# ప్రపంచానికి భారత్ ఆదర్శం

### "ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్" అంతర్జాతీయ సదస్సులోప్రధాని నరేంద్ర మోడీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్, 19 (సూర్యసేన ప్రతినిధి):** పర్యావరణాన్ని కాపాడుకుంటూనే ఆర్థికంగా ఎలా ఎదగాలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. "ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్" అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. మన దేశంలో పునరుత్పాదక ఇంధనం, పరిశుభ్రమైన రవాణా వ్యవస్థలు, నీటి సంరక్షణ ఎంత వేగంగా విస్తరిస్తున్నాయో వివరిస్తూ, పర్యావరణ పరిరక్షణతో పాటే ఆర్థిక పురోగతి కూడా సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రకృతితో మమేకమై జీవించడం భారత్‌కు శతాబ్దాల నుంచి వస్తున్న ఆచారం అని మోడీ గుర్తుచేశారు. తరతరాలుగా పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికి దిశానిర్దేశం చేసిన భారత్, ఆ సాంప్రదాయ అనుభవాలు, సిద్ధాంతాల పునాదిగానే నేటి ఆధునిక వాతావరణ సమస్యలకు పరిష్కారాలు చూపుతోందన్నారు. ప్రపంచ దేశాలన్నీ పర్యావరణ పరిర క్షణకు కలిసికట్టుగా ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లో తలసరి కార్బన్ ఉద్గారాల పరిమాణం చాలా తక్కువగా ఉందన్నారు. మన ప్రాచీన పర్యావరణ ఆలోచనలనే నేటి ఆధునిక పరిష్కారాలుగా మారుస్తూ ప్రకృతిని కాపాడుకుంటున్నామని తెలిపారు. భారత్ వాతావరణ వ్యూహంలో పునరుత్పాదక ఇంధనానిదే ప్రధాన పాత్ర అని మోడీ స్పష్టం చేశారు. ముఖ్యంగా సౌర విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేవలం 12 ఏళ్ల క్రితం 2 గిగావాట్లుగా ఉన్న మన సోలార్ సామర్థ్యం, ఈరోజు ఏకంగా 160 గిగావాట్లకు పైగా పెరిగిందని వెల్లడించారు. ఒక్క సోలార్ ఎనర్జీ వల్లే దాదాపు 20 కోట్ల టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలో కలవకుండా నిరోధించగలిగామని చెప్పారు. పవన విద్యుత్ సామర్థ్యం కూడా గత 12 ఏళ్లలో మూడు రెట్లు పెరిగిందని, దీనికి తోడు జల విద్యుత్ రంగాన్ని కూడా విస్తరించామని చెప్పారు. వీటితో పాటు అణు విద్యుత్‌ను పెంచడానికి, క్లీన్ ఎనర్జీ రంగంలోకి ప్రైవేట్ భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కృషి ఫలితంగానే గత పన్నెండేళ్లలో శిలాజయేతర ఇంధనాల ఆధారిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న మన దేశం, పారిస్ ఒప్పందంలో 2030 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఐదేళ్ల ముందే, అంటే 2025లోనే సాధించింది. మొత్తం విద్యుత్ సామర్థ్యంలో 50 శాతానికి పైగా శిలాజయేతర ఇంధనాల నుంచే సాధించి భారత్ రికార్డు సృష్టించింది. గత 12 ఏళ్లలో పర్యావరణానికి సంబంధించిన ప్రతి రంగంలోనూ భారత్ అసాధారణమైన ప్రగతి సాధించిందని, ఇందులో పునరుత్పాదక ఇంధనానిదే కీలక పాత్ర అని మోడీ కొనియాడారు.

## ఢిల్లీలో 'వికసిత్ భారత్' ఆర్థిక సదస్సు.. హాజరైన పయ్యావుల, భట్టి



**ఢిల్లీ, సెప్టెంబర్, 19 (సూర్యసేన ప్రతినిధి):** ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్' ఆర్థిక సదస్సు రెండో రోజు ప్రారంభమైంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో వికసిత్ భారత్ దిశగా దేశానికి ఆర్థిక వనరులపై చర్చించనున్నారు. కేంద్ర – రాష్ట్రాల విధాన సమన్వయంపై ప్రధానంగా చర్చ జరుగనుంది. వికసిత్ భారత్ లక్ష్యానికి ఆర్థిక సవాళ్లు, విధాన ప్రాధాన్యంపై, మైక్రో ఎకనామిక్ పరిస్థితులపై చర్చ జరిగే అవకాశం ఉంది. అలాగే వ్యవసాయ రంగ పరివర్తనకు ఆర్థిక వనరులపై సదస్సుల్లో చర్చిస్తారు. ఎనర్జీ ట్రాన్సిషన్‌కు నిధుల సమీకరణపైనా చర్చించనున్నారు. ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాల నుంచి ఆర్థిక శాఖ మంత్రులు పాల్గొన్నారు. ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. అలాగే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు, ఆర్థిక శాఖ కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి



**హైదరాబాద్, సెప్టెంబర్, 19 (సూర్యసేన ప్రతినిధి):** వరంగల్ మామునూరులో కొత్తగా ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలో సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ ప్రాజెక్టును తమ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు, కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి సారించిందని, ప్రజలకు అత్యవసరమైన విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఆ భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఎఎఐ) అప్పగించినట్లు తెలిపారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి, పెట్టుబడులకు ఒక నూతన ముఖద్వారమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానమవుతున్న తెలంగాణకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

## ఆంధ్రాకు నీళ్లు.. రాష్ట్రానికి కన్నీళ్లు



**వనపర్తి ప్రతినిధి/శ్రీరంగపురం, సెప్టెంబర్, 19 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణకు రావాల్సిన సా గునీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారని, తెలంగాణ రైతులకు నీళ్లెక్కడ అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.టి.రామారావు ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు ముఖ్యంగా పాలమూరు ప్రాంతానికి రావాల్సిన వాటా ద క్కే వరకు పోరాడుతామని ఆయన అన్నారు. వనపర్తి నియోజకవర్గంలోని పె బ్బేరు పట్టణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కెటిఆర్ మా ట్లాడారు. పర్యటనలో భాగంగా రైతులతో మాట్లాడానని, విద్యుత్తు, సాగునీటి స మస్యలపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని చెప్పారు. ప్రకృతి అనుకూలం గా ఉండి నీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందడం లేదని వాపోయారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో సుమారు 7 వేల మెగావాట్ల విద్యుత్తు స్థాపిత సామర్థ్యం ఉండగా.. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాన్ని 24 వేల మెగావాట్లకు పెంచామని పేర్కొన్నారు.

## భారీ వర్షాలు, గణేష్ నిమజ్జన

## శోభాయాత్ర ఏర్పాట్లపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష





– కమాండ్ కంట్రోల్ సెంటర్

నుంచి పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని టీ–జీఐసీసీసీ (కమాండ్ కంట్రోల్ సెంటర్)కు వెళ్లి రాష్ట్రంలో, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. భారీ వర్షాలతో పాటు నగరంలో జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రకు చేపట్టిన ఏర్పాట్లను కూడా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిశీలించారు.

గణేష్ శోభాయాత్ర ప్రారంభమయ్యే బాలాపూర్‌తో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన శోభాయాత్ర మార్గాల్లో రహదారుల పరిస్థితి, రోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, నీరు నిలిచే ప్రాంతాల్లో చేపట్టిన చర్యలు తదితర ఏర్పాట్లను సీఎస్ పరిశీలించారు. టీ–జీఐసీసీసీ ఇన్‌చార్జ్ అధికారి కమల్ హాసన్ రెడ్డి సీఎస్‌కు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జరుగుతున్న రియల్‌టైమ్ పర్యవేక్షణ, వివిధ ప్రాంతాల్లో పరిస్థితులపై అందుతున్న సమాచారం, శోభాయాత్ర మార్గాల్లో చేపట్టిన నిఘా ఏర్పాట్లను వివరించారు. శోభాయాత్ర మార్గాల్లో సిసిటివి కెమెరాల ద్వారా చేపడుతున్న నిఘా, పర్యవేక్షణ ఏర్పాట్లను కూడా సీఎస్ పరిశీలించారు. కీలకమైన ప్రాంతాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలు, శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో సిసిటివి నిఘాను మరింత పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చోట్ల వెంటనే నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. దెబ్బతిన్న రోడ్లకు అవసరమైన మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని, వర్షాల కారణంగా శోభాయాత్రకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

గణేష్ శోభాయాత్ర సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, విద్యుత్, వైద్య, అత్యవసర సేవలను సమన్వయంతో అందుబాటులో ఉంచాలని సీఎస్ సూచించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిస్థితులను రియల్‌టైమ్‌లో నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే సంబంధిత శాఖల అధికారులు స్పందించేలా సమన్వయం చేసుకోవాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. భారీ వర్షాలు, గణేష్ నిమజ్జన శోభాయాత్ర నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని ముందస్తు చర్యలను తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు.

## విద్యార్థులకు మరింత

## ఆకర్షనీయమైన రంగుల్లో యూనిఫాం.....

– వచ్చే ఏడాదికి ఇప్పటి నుంచే ప్రణాళిక

– ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షనీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని సీఎం అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని, రెండో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డికి అధికారులు తెలియజేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయిందన్నారు.



ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్ షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తయిందని సీఎంకు అధికారులు వివరించారు. వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ ఏడాది అందించిన యూనిఫాం, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైందని సీఎం అన్నారు.

## కోదాడలో కొలువుల జాతర....






– దేశంలోనే అతిపెద్ద జాబ్‌మేళాల్లో ఒకటిగా కోదాడ కార్యక్రమం

– 30 వేల మందికి పైగా నిరుద్యోగ యువత హాజరు.. 350 ప్రముఖ కంపెనీల రాక

– మట్టిలో మాణిక్యాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్ / కోదాడ ప్రతినిధి, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** కోదాడ పట్టణంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు అపూర్వ స్పందన లభించింది. దేశంలోనే అతిపెద్ద జాబ్‌మేళాగా కోదాడ కార్యక్రమం నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో రైతులు తమ భూములను అమ్ముకుని పిల్లలను చదివించారని, వారి కష్టానికి తగిన ఫలితం దక్కేలా గ్రామీణ ప్రాంతాల్లోని 'మట్టిలో మాణిక్యాలు'గా ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఎంతో కష్టపడి జాబ్‌మేళాను నిర్వహించినట్లు తెలిపారు. కోదాడ పట్టణంలో శనివారం ఎమ్మెల్యే, జాబ్‌మేళా నిర్వహణ కమిటీ చైర్మన్ ఎన్.పద్మావతిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ తదితరులతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. దేశంలో పేరుగాంచిన సుమారు 350 కంపెనీలు జాబ్‌మేళాకు తరలివచ్చాయని మంత్రి తెలిపారు. 30 వేల మందికి పైగా నిరుద్యోగ యువత హాజరై ఉద్యోగాల కోసం తమ విద్యార్హతలు, నైపుణ్యాల వివరాలను నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

2వ పేజీ లో...




# కోదాడలో కొలువుల జాతర...



కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ప్రజలే తమ కుటుంబ సభ్యులని పేర్కొన్న ఆయన, ప్రజల ఆదరాభిమానాలతో దీర్ఘకాలంగా ప్రజాసేవలో కొనసాగుతున్నానని తెలిపారు. జాబ్‌మేళాలో కొంతమంది అభ్యర్థులకు అక్కడికక్కడే నియామక పత్రాలు అందిస్తున్నామని, మరికొందరికి ఆయా కంపెనీలు తమ సంస్థల్లో పూర్తి స్థాయి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తాయని మంత్రి వివరించారు. ఉద్యోగాల విషయంలో యువతకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.



**నిరుద్యోగ యువత జీవితాల్లో కొత్త అధ్యాయానికి నాంది**

కోదాడలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా నిరుద్యోగ యువత జీవితాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. యువతకు విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు సుమారు 60 వేల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. ప్రైవేటు రంగంలోనూ యువతకు విస్తృత అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కోదాడలో భారీ స్థాయిలో జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. వందలాది కంపెనీలు, వేలాది ఉద్యోగ అవకాశాలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా యువత నేరుగా ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం కల్పించారని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన విద్య, ఉపాధి హక్కులను సమర్థవంతంగా అమలు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులోకి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఉత్తమ్--పద్మావతి దంపతుల కృషి అభినందనీయం**

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభివృద్ధికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దంపతులు నిరంతరం కృషి చేస్తున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గాల ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే తపన వారిలో ఉందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇంత భారీ స్థాయిలో జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగునీటి రంగంతో పాటు రహదారుల అభివృద్ధికి సుమారు రూ.10 వేల కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి చేస్తున్నారని గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. రైతుల పంటలను కాపాడేందుకు సాగునీటి వనరుల అభివృద్ధిపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అన్నారు. రైతుల ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తున్న వ్యక్తిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు. పౌరసరఫరాల శాఖ మంత్రిగా గత మూడేళ్లుగా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నారని గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడటంతో పాటు రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతు సంక్షేమం, సాగునీటి సదుపాయాలు, రహదారుల అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. జాబ్‌మేళాకు ఉదయం నుంచే వేలాది మంది యువత తరలివచ్చారు. వివిధ కంపెనీల ప్రతినిధులు



అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలను పరిశీలించి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. పలువురు అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. మరికొంతమందిని తదుపరి దశల ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు.



ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం, మార్కెట్ కమిటీ చైర్మన్ బాబు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మల్లీశ్వరి, టీపీసీసీ కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, బీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్, ఏఐసీసీ సభ్యుడు సర్వోత్తమ్‌రెడ్డి, సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కైలాష్, మాజీ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, జాబ్‌మేళా నిర్వహణలో బాధ్యతలు చేపట్టిన కేఎల్‌ఎం ప్రసాద్, బషీర్, ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఫ్లోర్ లీడర్ కందుల కోటేశ్వరరావు, గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీఓ సూర్యనారాయణ, రెవెన్యూ, పోలీస్, వైద్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సిబ్బంది, సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ, మండల శాఖల నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి వాటా సాధించడంలో ఉత్తమ్ విఫలం



**నేరేడుచర్ల ప్రతినిధి, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** తెలంగాణకు న్యాయబద్ధంగా రావాల్సిన శ్రీశైలం నీటి వాటాను సాధించడంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విఫలమయ్యారని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి ఆరోపించారు. రైతుల పొలాలు ఎండిపోతున్నా నీటి సమస్యపై ప్రభుత్వం కనీసం చర్చించకుండా ఆంధ్రప్రదేశ్‌కు నీటిని దానధర్మంగా ఇస్తోందని విమర్శించారు. నేరేడుచర్ల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొలాలు ఎండిపోతున్న పరిస్థితిపై కనీసం నీటి లెక్కలు తేల్చడంలో స్థానికంగా ఉన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విఫలమయ్యారని నరసింహారెడ్డి అన్నారు. నిండు శాసనసభలో అబద్ధాలతో తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 22ఏ భూముల అంశంపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తుందనే భయంతోనే తమ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని విమర్శించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు జరిగిన పరిస్థితే మిగిలిన ఎమ్మెల్యేలకు కూడా ఎదురవుతుందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భూములపై సర్వే పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి మళ్లించే రాజకీయాలకు పాల్పడుతున్నారని నరసింహారెడ్డి ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సోదరుడి వ్యవహారాలు, భూ సెటిల్‌మెంట్లపై ప్రజల్లో చర్చ జరుగుతోందని, వాటి నుంచి దృష్టి మళ్లించేందుకే కేసీఆర్‌పై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో మరింత పలుచనైందని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేష్‌బాబు, దొండపాటి అప్పిరెడ్డి, కడియం వెంకట్‌రెడ్డి, చెనబోయిన సైదులు, జయబాబు, పార్టీ నాయకులు, సామాజిక మాధ్యమాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాస్టర్ గుద్దేటి పాపమ్మ ఏ సువార్తమ్మ (101) ఇక సెలవు

**- పార్థివా దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన పాస్టర్స్**

**- బిషప్ డా దుర్గం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు**

**సూర్యాపేట / ఆత్మకూర్ (యస్ ), సెప్టెంబర్ 19 (సూర్య సేన):** ఆత్మకూర్ (యస్ ) మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు నందు క్రీస్తు ప్రేమ పరిశుద్ధ సహవాస సంఘం వ్యవస్థాపకురాలు పాస్టర్ గుద్దేటి పాపమ్మ ( సువార్తమ్మ ) నిన్న శుక్రవారం 18వ తేది న ప్రభు నందు నిద్రించ్చరనీ ఆమె మరణం సంఘానికి మరియు కుటుంబ సభ్యులకు తీరని లోటనీ తన నివాసం చర్చి లో వారి కొరకు ప్రార్థించి ఆమె పార్థివ దేహానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ వారు మాట్లాడుతూ గొప్ప దైవజనురాలును సూర్యాపేట ప్రాంత వాసులు కోల్పోయినమని కీ. శే. గుద్దేటి పాపమ్మ, సువార్తమ్మ (101) సంవత్సరాలు బ్రతికిందని ఆమె చివరి వరకు కూడా తన పని తనే చేసుకునేదని, గొప్ప ప్రార్ధన పరురాలు అది మాత్రమే కాకుండా గత 40 సంవత్సరాల క్రితం కీ. శే. అపోస్తులు పాస్టర్ రెవ.జలగం పేతురు చే డబ్ల్యూ.యం.ఇ. నెమ్మికల్ సంగం ద్వారా మారుమనస్సు రక్షణ బాప్తిస్మము పొంది గత 35 సం. రాల నుండి ప్రభువైన యేసుక్రీస్తు సేవా చేస్తూ అనేకమందినీ ప్రభువైపు నడిపించిందని ఆత్మకూర్ మరియు కోటపహాడ్ రెండు గ్రామాల్లో సంఘాలను నడుపుతూ, ఈ ప్రాంతంలో రాజకీయ నాయకులకు, క్రైస్తవులకు మంచి ససంబంధం కలిగిన వ్యక్తి అనీ బాధను వ్యక్తపరుస్తూ ఆమెకు ఘన నివాళులు అర్పించినారు.వారితో చార్లెట్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ జాటోత్ డేవిడ్ రాజు, సూర్యాపేట నియోజకవర్గ పాస్టర్స్ పెలోషిఫ్ అధ్యక్షులు రెవ. డా. జలగం జేమ్స్, ఆత్మకూర్ ( యస్ ) మండలం అధ్యక్షులు రెవ. డా. గుంటూరు శాంతాయ్య,సూర్యాపేట రూరల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెవ. ఏర్పుల క్రీస్థోఫర్, చివ్వేంల మండలం అధ్యక్షులు గుగులోత్ బాలాజీ నాయక్, రెవ. డా.పంది మార్కు, వరికుప్పల మత్తయి, బానోత్ సుధాకర్, శ్యాగ యాకోబు, బొల్లెద్దు మోష,పిట్టల సామెల్, సైదా నాయక్ పెద్ద ఎత్తులో పాస్టర్స్ పాల్గొన్నారు తన పెద్ద కుమార్తె తంగేళ్ల పూలమ్మ, మనమడ్లు కుటుంబ సభ్యులను సంఘ సభ్యులను పారమర్శించి ఓదార్చారు ఈ కార్యక్రమం లో బంధువులు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే: మంత్రి ఉత్తమ్



**- కోదాడ సభలో ప్రకటనకు మార్మోగిన హర్షధ్వానాలు**

**- మన పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించడాన్ని మించిన ఆనందం లేదు**

**- దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగం వచ్చే వరకు అండగా ఉంటాం**

**- కోదాడలో త్వరలో 'టాస్క్' కేంద్రం: మంత్రి శ్రీధర్‌బాబు**

**- 350 కంపెనీల ద్వారా 5,725 మంది అభ్యర్థుల ఎంపిక**



**హైదరాబాద్ / కోదాడ, సెప్టెంబర్ 19 (సూర్య సేన):**

తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



కోదాడలో శనివారం నిర్వహించిన భారీ మెగా జాబ్‌మేళాను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ ఈ ప్రకటన చేయగానే సభా ప్రాంగణం హర్షధ్వానాలతో మార్మోగింది.

గత లోక్‌సభ ఎన్నికల్లో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు లభించిన భారీ ఆధిక్యమే ఈ ప్రాంతంలో పార్టీకి ఉన్న ప్రజాబలానికి నిదర్శనమని ఉత్తమ్ పేర్కొన్నారు. లక్షకు పైగా మెజారిటీ సాధించడంలో ఈ రెండు నియోజకవర్గాలు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ఏర్పడుతుందని స్పష్టం చేశారు. అనంతరం మెగా జాబ్‌మేళా ప్రాముఖ్యతను వివరిస్తూ, గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలను నేరుగా అందుబాటులోకి తీసుకురావడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు. పాఠశాలలు, కళాశాలలు నిర్మిస్తాం.. రహదారులు వేస్తాం.. ఎత్తిపోతల పథకాలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తాం. కానీ మన పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించినప్పుడు కలిగే ఆనందం వీటన్నింటికంటే గొప్పది" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. మెగా జాబ్‌మేళాకు దాదాపు 365 కంపెనీలను ఆహ్వానించగా, సుమారు 350 కంపెనీలు స్పందించి కోదాడకు వచ్చాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఐఫోన్లను తయారు చేసే తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ వంటి బహుళజాతి సంస్థలు హైదరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, వాటికి పెద్ద సంఖ్యలో ఇంజినీర్లు అవసరమవుతున్నారని చెప్పారు. అయితే కోదాడ, హుజూర్‌నగర్, నడిగూడెం, మునగాల వంటి ప్రాంతాలకు చెందిన ఇంజినీరింగ్ పట్టభద్రులు ఆ సంస్థలను నేరుగా సంప్రదించే అవకాశం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. మన యువత కంపెనీల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉంటే, కంపెనీలనే యువత వద్దకు తీసుకురావాలి. యువత, పరిశ్రమల మధ్య నేరుగా అనుసంధానం కల్పించాలనే ఆలోచనతోనే ఈ మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేశాం" అని ఉత్తమ్ తెలిపారు. తాను, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి దశాబ్దాలుగా ఏర్పరచుకున్న పరిచయాలను ఉపయోగించి వివిధ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడామని చెప్పారు. పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్‌తోపాటు ఇతర ప్రభుత్వ సంస్థలు కూడా కంపెనీలను కోదాడకు తీసుకురావడంలో సహకరించాయని వివరించారు. హైదరాబాద్‌కు దూరంగా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుకు సమీపంలో ఉన్న కోదాడకు వందలాది కంపెనీలను రప్పించడం సాధారణ విషయం కాదన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాతోపాటు ఖమ్మం ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఈ అవకాశంపై అవగాహన కల్పించేందుకు పత్రికలు, టెలివిజన్, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించామని చెప్పారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం క్యూఆర్ కోడ్‌లను పెద్ద ఎత్తున అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.



జాబ్‌మేళా విజయవంతానికి కృషి చేసిన సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీ, పరిశ్రమల శాఖ, సింగరేణి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు, ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంతోనే తమ బాధ్యత ముగిసిపోదని ఉత్తమ్ స్పష్టం చేశారు. "ఇక్కడ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నా కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలి. ఈరోజే ఉద్యోగం వచ్చినా, పరిశీలించి తరువాత అవకాశం కల్పిస్తామని కంపెనీ చెప్పినా మేము ఫాలోఅప్ చేస్తాం. యువతకు ఉద్యోగం లభించే వరకు అండగా ఉంటాం" అని భరోసా ఇచ్చారు. కోదాడతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న ఉత్తమ్, 32 సంవత్సరాల క్రితం 1994లో తొలిసారిగా ఇక్కడి నుంచే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినట్లు తెలిపారు.

**కోదాడలో త్వరలో 'టాస్క్' కేంద్రం**

కోదాడలో త్వరలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్--- 'టాస్క్' కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. స్థానిక యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి, మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఈ కేంద్రం లక్ష్యమని తెలిపారు. మెగా



జాబ్‌మేళాలో మాట్లాడిన శ్రీధర్‌బాబు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. జాబ్‌మేళాలో పాల్గొన్న 350కి పైగా కంపెనీలు దాదాపు 5,725 మంది అభ్యర్థులను ప్రాథమికంగా ఎంపిక చేయడం గొప్ప విజయమని శ్రీధర్‌బాబు అభినందించారు.



ఈ భారీ కార్యక్రమం విజయవంతం కావడానికి వారం రోజులుగా నిరంతరం శ్రమించిన అధికారులు, కంపెనీల ప్రతినిధులు, సుమారు 700 మంది వాలంటీర్ల సేవలను ప్రశంసించారు.

ప్రభుత్వం ఒక్కటే ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదని, ప్రైవేటు రంగం కూడా ముందుకొచ్చి ఉపాధి అవకాశాల కల్పనలో కీలక పాత్ర పోషించాలని కోరారు. డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, డిప్లొమా, ఐటీఐ, ఫార్మసీ తదితర విద్యార్హతలు కలిగిన యువతకు పరిశ్రమలు విస్తృత అవకాశాలు కల్పించాలన్నారు. వందలాది కంపెనీలను గ్రామీణ యువత వద్దకు తీసుకొచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొనేలా ఉత్తమ్ వ్యక్తిగతంగా పలుమార్లు సంప్రదింపులు జరిపారని చెప్పారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి విజ్ఞప్తి మేరకు కోదాడలో వీలైనంత త్వరగా 'టాస్క్' కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కేంద్రం స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించే ప్రధాన వేదికగా మారడంతోపాటు వారిని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతుందని తెలిపారు. ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న యువత వాటిని తమ జీవిత ప్రయాణంలో తొలి అడుగుగా భావించాలని శ్రీధర్‌బాబు సూచించారు. నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ కష్టపడి పనిచేయాలని కోరారు. ప్రస్తుతం ఉద్యోగాలు పొందిన వారిలో కొందరు భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా ఎదిగి, తిరిగి కోదాడకు వచ్చి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

# విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల చర్చ



**- డిజిటల్ విద్యా సౌకర్యాలపై తల్లిదండ్రుల హర్షం**

**నేరేడుచర్ల ప్రతినిధి, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల నందు విద్యార్థుల అభ్యసనాసామర్థ్యాలు,హాజరు,పాఠశాల అభివృద్ధి తదితర అంశాలలో తల్లిదండ్రులు--ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ప్రధానోపాధ్యాయులు బట్టు మధు కోరారు పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశానికి అధిక సంఖ్యలో తల్లిదండ్రులు హాజరయ్యారు.విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని,ఇంటి వద్ద పిల్లల చదువును ప్రవర్తనలను నిరంతరం పరిశీలించాలని కోరారు.పాఠశాలలో డిజిటల్ బోధనా సౌకర్యాలు,కంప్యూటర్ విద్య, సైన్స్ ప్రయోగాల వినియోగం క్రీడలలో ప్రతిభ తల్లిదండ్రులకు వివరించారు పాఠశాలల్లో ఆధునిక విద్యా సౌకర్యాలు కల్పిస్తూ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలు చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు ప్రస్తుత తరుణంలో తల్లిదండ్రుల పాత్ర కీలకంగా మారిందని తగిన సమయం వెచ్చించి తల్లిదండ్రులు విద్యార్థుల విద్యాభివృద్ధికి తమతో పాటు కృషి చేయాలని కోరారు తల్లిదండ్రులు ఉత్సాహంగా చర్చలో పాల్గొన్నారు ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు

# కాంగ్రెస్--బీఆర్ఎస్ మధ్య ఫిక్స్ మ్యాచ్ రాజకీయాలు....



– డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తరహాలో ఫ్రెండ్లీ ఫైట్..
ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారంటూ బీజేపీ నేత బూర నర్సయ్య గౌడ్ విమర్శలు

**హైదరాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య జరుగుతున్న రాజకీయ రగడ ప్రజలను మభ్యపెట్టేందుకే జరుగుతున్న నాటకమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. ఇరు పార్టీల మధ్య డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తరహాలో ఫిక్స్ మ్యాచ్ జరుగుతోందని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్ల ఎనిమిది నెలలు పూర్తవుతున్నా, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా 'డైవర్షన్, డిస్ట్రక్షన్, డిమాలిషన్' విధానాన్ని అనుసరిస్తోందని బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు, 22ఏ నిషేధిత జాబితాలో భూముల అంశం వంటి సమస్యలపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరగడం లేదన్నారు. బీజేపీ నేతలు ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న సమయంలో వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ అసెంబ్లీని అపహాస్యం చేసే స్థాయికి తీసుకెళ్లిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ సభను మాకరీ చేస్తే, ప్రతిపక్ష బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ లకే పరిమితమైందని వ్యాఖ్యానించారు. ఇరు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూ ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్రమంత్రులు జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని, వాటికి సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నేతలు అసహనంతో వ్యవహరిస్తున్నారని బూర నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీ నేతలపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఎంపీగా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులపై విచారణ పేరుతో ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తోందని బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్, హరీశ్‌రావు నివాసాల చుట్టూ మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యటించడం రాజకీయ కార్యక్రమంగా మారిందని విమర్శించారు. నిజంగా అక్రమాలు జరిగాయని ప్రభుత్వం భావిస్తే చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అక్రమ నగదు లావాదేవీలపై సంబంధిత చట్టాల ప్రకారం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో భూ వ్యవహారాలపై కూడా ఆయన పలు ఆరోపణలు చేశారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ, రేడియల్ రోడ్ల పేరుతో పెద్దఎత్తున భూముల వ్యవహారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మునగనూరు గ్రామంలో నిజాం కాలం నాటి సర్వే నంబర్లు 44/1, 44/10లోని సుమారు 12 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తి పేరిట బదలాయించబడిందని ఆయన పేర్కొన్నారు. ఆ భూమి విలువ సుమారు రూ.300 కోట్లు ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూ వ్యవహారాలపై సమగ్రంగా విచారణ జరిపించాలని బూర నర్సయ్య గౌడ్ కోరారు. భవిష్యత్తులో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అక్రమంగా జరిగిన భూ బదలాయింపులు, పట్టాలు, నిషేధిత జాబితాల వ్యవహారాలను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. భూ అక్రమాలకు పాల్పడిన వారిపై దర్యాప్తు సంస్థల ద్వారా విచారణ జరిపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, శ్రీధర్, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి యూత్ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ...



– ముఖ్య అతిథులుగా హాజరైన నాగార్జునసాగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శీను నాయక్ టౌన్ ఎస్సై సతీష్

**నాగార్జునసాగర్, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** నాగార్జునసాగర్ హిల్ కాలనీ బీసీ స్కూల్ వెనుక స్ఫూర్తి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రుల్లో భాగంగా మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగార్జునసాగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శీను నాయక్ టౌన్ ఎస్ఐ సతీష్ లు హాజరై స్ఫూర్తి యూత్ కమిటీ సభ్యులతో కలిసి గణేశునికి ప్రత్యేక పూజలు చేశారు, అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు, భక్తిశ్రద్ధలతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ శీను నాయక్ మాట్లాడుతూ యువత భక్తి భావంతో పాటు సమాజ సేవలో కూడా ముందుండాలని పిలుపునిచ్చారు.

ఎస్సై సతీష్ మాట్లాడుతూ యువత సామాజిక బాధ్యత ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టటం ఆనందనియమని అన్నారు,

ఈ అన్న ప్రసాదవితరణ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు . ఈ సందర్భంగా స్ఫూర్తి యూత్ సభ్యులు మాట్లాడుతూ తమకు ప్రతి సంవత్సరం సహాయ సహకారాలు అందిస్తున్న పెద్దలకు, భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.




# ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న శ్రీకృష్ణ రాయబారం పద్యనాటకం....



**రంగారెడ్డి, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** అల్మాపురి వెల్ఫేర్ అసోసియేషన్ వినాయక చవితి పర్వదిన సందర్భంగా అల్మాపురి పెద పార్క్ లో జరిగిన శ్రీకృష్ణరాయబారం పద్య నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముందు జరిగిన కార్యక్రమంలో ఒకల్ డాన్స్ లో గాయత్రి, అబిత ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అద్భుతంగా ఉంది. ఈ ప్రదర్శన అనంతరం శ్రీ దుర్గేశ్వర నాట్యమండలి ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం పద్య నాటకంలో శ్రీకృష్ణుడిగా మల్లాది వెంకటరమణ దుర్యోధనుడిగాఎంపాల్వాచారి అర్జునుడిగాబిఎస్ఎఫ్వ్యాక్టరీ భటుడిగావెంకటేశ్వర్లు తమ ప్రదర్శనను అద్భుతంగా ప్రదర్శించారు కార్యక్రమం అనంతరం కమిటీ అధ్యక్షులు శ్రీమన్నారాయణ కార్యదర్శులు కృష్ణారెడ్డి ఉపాధ్యక్షులు వీరేంద్ర, రాజగోపాల్ రెడ్డి,కృష్ణయ్య, వేణుగోపాలచారి,రమేష్ ,సత్యనారాయణ లు కళాకారులను ఘనంగా సత్కరించారు. మేకప్ మల్లాది గోపాలకృష్ణ ( బాబురావు అండ్ కంపెనీ ) సంగీతం మంగపతిరావు సహకారం మల్లాది శ్రీ సాయి హరీష్ ను ఘనంగా సత్కరించారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమం



**నల్గొండ ప్రతినిధి, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** నల్గొండ పట్టణంలోని న్యూ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. న్యూ వెంకటేశ్వర కాలనీ వాసులు, వెంకటరమణ జువెలరీ అధినేత లకుమారపు శ్రీనివాస్--సునీత దంపతులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పద్మావతి ఉద్యానవనం వెంకటేశ్వర కాలనీ పార్కులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ రావిరాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి బండారు ప్రసాద్ లకుమారపు శ్రీనివాస్ సునీత, శ్రీధర్ రెడ్డి పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం నిర్వహించడం అభినందనీయమని, భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా సేవా భావాన్ని చాటుతున్న లకుమారపు శ్రీనివాస్--సునీత దంపతులు, వారి కుటుంబ సభ్యులను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో స్ఫూర్తిని నింపుతాయని అన్నారు. కార్యక్రమంలో సూది రెడ్డి లింగారెడ్డి, సురిగి కృష్ణయ్య నాగులపల్లి శ్యాంసుందర్, శ్రీపాద కృష్ణమాచారి ,రామచంద్రయ్య, నల్లరాజు నాగార్జున , ముదుంబా జనార్ధనాచార్యులు నూకల జైపాల్ రెడ్డి కొండోజు పుల్లయ్య , నరసింహ, సముద్రాల శ్రీనివాస్, గౌరు గోపాలకృష్ణమూర్తి ,భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు

# భారత రాష్ట్ర సమితిలో వికలాంగుల విభాగం ఏర్పాటు చేయాలి

– బి.ఆర్.ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు విజ్ఞప్తి

**రంగారెడ్డి, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** భారత రాష్ట్ర సమితిలో వికలాంగుల విభాగం ఏర్పాటు చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట ప్రెసిడెంట్ కల్వకుంట్లతారకరామారావు విజ్ఞప్తి చేసినట్లు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సమాజంలో అత్యంత వెనుకబడి అణగారిన వర్గంగా మిగిలిపోయిన వికలాంగులకు రాజకీయ భవిష్యత్తును ఆత్మ గౌరవాన్ని కల్పించేందుకు భారత రాష్ట్ర సమితి పార్టీలో ప్రత్యేకంగా వికలాంగుల విభాగాన్ని ఏర్పాటు చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కలవకుంట్ల తారక రామారావు ఒక విజ్ఞప్తి చేసినట్లు గిద్దె రాజేష్ తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో విస్తరించి ఉన్న వికలాంగుల సమాజం దశాబ్దాలుగా రాజ్యాధికారానికి రాజకీయ అవకాశాలకు దూరంగా ఉ ఒడిపోయిందని వారి బాధలు ఆవేదన వినే నాయకుడు వారి గొంతుకై నిలిచే వేదిక లేకపోవడం వల్లే వారి జీవితాలు నేటికీ దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగులను రాజకీయ పార్టీలు ప్రభుత్వాలు కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం చేయకుండా వారికి రాజకీయ రంగంలోనూ ప్రాతినిధ్యం నిర్ణయాత్మక పాత్ర కల్పించాల్సిన చారిత్రక అవసరం ఉందని అన్నారు. అందుకే రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తమ పార్టీ నిర్మాణంలో వికలాంగుల విభాగాలను ఏర్పాటు చేయాలని వారికి పార్టీ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ క్రమంలోనే భారత రాష్ట్ర సమితి పార్టీ దేశానికి ఆదర్శంగా నిలవాలని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీలో వికలాంగుల విభాగ కమిటీలను ఏర్పాటు చేసి రాబోయే నూతన కార్యవర్గాలలో 21 రకాల వికలాంగులకు పెద్దపీట వేయాలని కలవకుంట్ల తారక రామారావుకు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. గతంలో కేసీఆర్ పాలనలో వికలాంగుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం దక్కిందని అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ వికలాంగులను పార్టీ కార్యకలాపాలలో భాగస్వాములను చేస్తే పార్టీకి మరింత బలం చేకూరుతుందని పార్టీలో వికలాంగుల విభాగం ఏర్పాటుతో పాటు అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వికలాంగులకు పెన్షన్ 6000 పెంచసామని ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తానని రాష్ట్రంలో వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలు భర్తీ చేస్తామని రాష్ట్రంలో వికలాంగుల అట్రాసిటీ చట్టం 2016 సమర్థవంతంగా అమలు చేస్తామని రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి విడదీసి ప్రత్యేక విభాగంగా కొనసాగిస్తామని ముఖ్యంగా తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రాయితీలు రిజర్వేషన్లు కల్పిస్తామని అనేక హామీలు ఇచ్చి వికలాంగులను నమ్మవలికి వికలాంగుల ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్న వికలాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా వికలాంగుల సమాజం పట్ల వివక్ష ప్రదర్శిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీల సాధన కోసం భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టి నిస్సహాయ స్థితిలో ఉన్న వికలాంగుల సమాజానికి అండగా నిలబడాలని కేటీఆర్ కు విజ్ఞప్తి చేసినట్లు రాజేష్ తెలిపారు.

# విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులకు ఏపీ ఎస్‌బీఈ నిబంధనలు అమలు చేయాలి..



– ప్రతి సబ్‌స్టేషన్‌లో నలుగురు సబ్ ఇంజినీర్లు, నలుగురు ఐటీ ఆపరేటర్లు, నలుగురు కార్యాలయ సహాయకులను ఏర్పాటు చేయాలి
– తెలంగాణ బహుజన విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిదల ప్రసాద్

**హైదరాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** తెలంగాణ బహుజన విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఏపీ ఎస్‌బీఈ నిబంధనలను తెలంగాణలో వెంటనే అమలు చేయాలని తెలంగాణ బహుజన విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిదల ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ బహుజన విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగ సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో నలుగురు సబ్ ఇంజినీర్లు, నలుగురు ఐటీ ఆపరేటర్లు, నలుగురు కార్యాలయ సహాయకులు ఉండే విధంగా సిబ్బంది నియామక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనివల్ల విద్యుత్ సరఫరా నిర్వహణతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని పడిదల ప్రసాద్ కోరారు. సమావేశంలో శివ, వెంకటేష్, భూషణం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీలి విప్లవంలో నవభారత శకం...







– నమో మంత్ర ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, యర్రం వెంకటరెడ్డి

**రంగారెడ్డి, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** సబ్ కా సాత్,సబ్ కా వికాస్, సబ్ కావిశ్వాస్, అనేది ప్రధానమంత్రి నరేంద్రమోడీ దార్శనీక నాయకత్వ తారక మంత్రమని నమో మంత్ర ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి యర్రం వెంకటరెడ్డి అన్నారు. నెలరోజుల పాటు నరేంద్ర మోడీ జన్మదినోత్సవ వేడుకలు జరపాలని ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వారి జీవితాలను మోడీ తన విశిష్ట పాలనా దక్షతతో అమితంగా ప్రభావితం చేశారని ఆర్థిక ప్రగతి పై ఆయన విధానం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. వెనుకబడిన జిల్లాలను ఆకాంక్షాత్మక జిల్లాలుగా, సరిహద్దు గ్రామాలను సమర్థ ప్రథమ గ్రామాలుగా, ఈశాన్య ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా, వర్ణించడం ఆయన పరిణామాత్మక దృక్పథానికి ప్రతీక అని అన్నారు. ఈ విధానం భౌగోళిక వివక్షను సాధికారతను రూపుదిద్ది వికసిత్ భారతదేశంగా ప్రస్థానంలో వివిధ వర్గాలు క్రియాశీలక భాగస్వామ్యానికి బాటలు వేసిందని పేర్కొన్నారు. నమో మంత్ర ఫౌండేషన్ తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ ఏ.ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ పిఎం జన్మాన్, పీఎం జన్ ధన్, పీఎం గరీబి కళ్యాణ్ యోజన, వంటి పథకాలే వికసిత్ భారత్ విజయానికి మార్గాలని అన్నారు. ఈ విజయానికి నిదర్శనం ఈ పథకాలే అని వీటితో పాటుగా ఇతరత్రా అమలుపరుస్తున్న కార్యక్రమాలు కూడా సార్వజనిక ప్రగతి సామాజిక సాధికారతపై ప్రధానమంత్రి నిబద్ధత చాటి చెబుతుందని కనుకనే దేశవ్యాప్తంగా 25 కోట్ల మంది పేదరికం నుండి విముక్తి పొందారని ఈ అపూర్వ పురోగతి మన జాతి జీవనంలోనే కాకుండా సమస్త మానవాళి చరిత్రలో కూడా ఒక చిరస్మరణీయ మలుపు అని ఆయనకు మనం ఇవ్వగలిగిన జన్మదిన శుభాకాంక్షలు ఇవే అని ప్రపంచవ్యాప్తంగా పేదరికం ఆకలి దప్పుల నుండి నిరుపేదలు శాశ్వతంగా బయటపడే రోజు త్వరలోనే తప్పక వస్తుంది అనడానికి ఈ భారత విజయం ఒక శుభసంకేతమని అన్నారు. కార్యక్రమంలో దొంతి ఆంజనేయులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ భారత ప్రధాని అయిన తర్వాత భారతదేశం అద్వితీయంగా ముందుకు వెళుతుందని అన్ని కార్యక్రమాలలో ప్రజలను భాగస్వాములను చేస్తూ ప్రధాని చేపడుతున్న అనేక కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు, ప్రముఖ సామాజికవేత్త ఏపూరి అశోక్ కుమార్ మాట్లాడుతూ సబ్ కా సాత్ సబ్ కా వికాస్ పేరుతో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న భారతదేశం అభివృద్ధి పథంలో ప్రగతి పదంలో పురోగమిస్తుందని అన్నారు నమో మంత్ర జాతీయ ఉపాధ్యక్షురాలు మహిళా విభాగం గుదిబండ్ల లలిత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో అనేకమంది నమో మంత్ర ఫౌండేషన్ సభ్యులు భారీ ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# సూర్యాపేట పట్టణ బంద్ కు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు



**సూర్యాపేట, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** సూర్యాపేట పట్టణంలో శుక్రవారం జరిగిన బంద్ కు పూర్తిగా సహకరించిన వర్తక వ్యాపార వర్గాలకు , హోటల్స్ యజమానులకు మెకానిక్ లకు, లాయర్స్ కు బందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బుల్లెట్ ట్రైన్ సాధన సమితి జేఏసీ ధన్యవాదాలు తెలిపింది. శనివారం సుధా బ్యాంకు ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎండలను కూడా లెక్క చేయకుండా పెద్ద ఎత్తున అన్ని వర్గాల ప్రజలు బందులో పాల్గొన్నారని తెలిపారు. సూర్యాపేట ప్రజల ఐకమత్యాన్ని ఈ బంద్ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేశామని, బంద్ కు మద్దతుగా నిలిచిన పాఠశాల కళాశాలల యజమానులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఉపాధ్యాయ సంఘాలు, బీసీ సంఘాలు, ప్రజా సంఘాలకు ధన్యవాదాలు తెలియజేశారు. బంద్ లో బ్యాంకులు, కార్పొరేట్ సంస్థలు షాపింగ్ మాల్స్ కూడా స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొన్నారని చెప్పారు. సూర్యాపేట బంద్ బుల్లెట్ ట్రైన్ సాధనలో ఒక కీలకమైన సంఘటన అని ఈ సందర్భంగా పలువురు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పెద్దిరెడ్డి రాజా, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మల్లు, నాగార్జున రెడ్డి , నెమ్మది వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, మందాడి డేవిడ్, కొత్తపల్లి శివకుమార్, చల్లమల్ల నరసింహ, సలిగంటి వీరేంద్ర, ఎల్గూరి రామ్మూర్తి , కర్నాటి కిషన్, పెద్దిరెడ్డి గణేష్, బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకిరామిరెడ్డి, భూపతి రాములు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

ఆదివారం, సెప్టెంబర్ 20, 2026

# అంతరిక్ష రణంతో పెనుసంక్షోభం

విశ్వశాంతి కోసం వైజ్ఞానిక ప్రయోగాలకు, శాంతిభద్రతలకు వినియోగించవలసిన అంతరిక్షం, అగ్రరాజ్యాల మధ్య పరస్పర అవిశ్వాసం పెరిగిపోయి ఇప్పుడు సరికొత్త వ్యూహాత్మక యుద్ధ రంగంగా మారుతోంది. ఇప్పటివరకు హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ సినిమాలకే పరిమితమైన 'స్పేస్‌వార్' కాన్సెప్ట్ ఇప్పుడు క్రమంగా వాస్తవ ప్రపంచం లోకి అడుగుపెడుతోంది. భూమి చుట్టూ ఉన్న కక్షలో శత్రుదేశాల (ముఖ్యంగా చైనా, రష్యాలు) వ్యూహాలను చిత్తు చేయడానికి అంతరిక్ష నియంత్రణ ఆయుధాలను (స్పేస్ కంట్రోల్ వెపన్స్) మోహరించినట్టు అమెరికా వైమానిక దళ కార్యదర్శి ట్రాయ్ మీంక్ అధికారికంగా వెల్లడించడం ప్రపంచ దేశాల్లో అలజడి ప్రారంభమైంది. చైనా, రష్యాలు తమ అంతరిక్ష సైనిక సామర్థ్యాలను విస్తరిస్తున్న తరుణంలో అమెరికా ఈ సంచలనాత్మక ప్రకటన చేయడం విశ్వాంతరాళంలో సరికొత్త వ్యూహాత్మక పోరుకు తెరలేపింది. అమెరికా చర్యలను చైనా, రష్యా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ వారు కూడా అంతరిక్షంలో ఇతర దేశాల ఉపగ్రహాలను అడ్డుకునే అత్యాధునిక కౌంటర్ స్పేస్ సాంకేతికతలను, హైపర్ సోనిక్ గ్లైడ్ వాహనాలను వేగంగా అభివృద్ధి చేస్తుండటం గమనార్హం.

భారత్ కూడా 2019 లోనే 'మిషన్ శక్తి' ద్వారా ఉపగ్రహ నిరోధక క్షిపణి సామర్థ్యాన్ని నిరూపించుకుని అంతరిక్ష రక్షణ రంగంలో బలమైన శక్తిగా ఎదిగింది. ఈ విధంగా ఏ దేశానికి ఆ దేశం పరస్పర అవిశ్వాసంతో అంతరిక్ష ఆయుధాల పోటీని పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. అంతరిక్ష ఆయుధాల దాడివల్ల ఉపగ్రహాలు ధ్వంసం అవుతాయి. ప్రపంచ దేశాల కమ్యూనికేషన్, నావిగేషన్, వాతావరణ అంచనా వ్యవస్థలు, విమానయానం, మొబైల్ సిగ్నల్స్ వ్యవస్థ, జిపిఎస్, బ్యాంకింగ్ లావాదేవీలు తదితర అత్యంత కీలకమైన వ్యవస్థలన్నీ ఉపగ్రహాల ఆధారంగానే పనిచేస్తున్నాయి. ఉపగ్రహాలు ధ్వంసం అయితే భూమిపై పెను సంక్షోభం ఏర్పడుతుంది. అందుకనే అమెరికా అంతరిక్ష నియంత్రణల ఆయుధాల మోహరింపు ప్రకటనపై ప్రపంచం ఆందోళన చెందుతోంది. 1967లో అంతరిక్షం రణక్షేత్రంగా మారకూడదన్న ముందుచూపుతో 'అంతరిక్ష ఒప్పందం' (అవుటర్ స్పేస్ ట్రీటీ) కుదిరింది. ఈ ఒప్పందంపై భారత్, అమెరికా, చైనా, రష్యా (అప్పటి సోవియెట్ యూనియన్) సహా కనీసం 118 దేశాలు సంతకం చేశాయి. ఈ ఒప్పందంలో అణు ఆయుధాలను, ఇతర సామూహిక వినాశన ఆయుధాలను భూకక్షలోకి, చంద్రగోళం పైకి మోహరించకూడదని, ఈ ఖగోళాలపై సైనిక స్థావరాల నిర్మాణం, ఆయుధ పరీక్షలు నిర్వహించడం, ఖనిజాల తవ్వకం వంటి చర్యలేవీ పనికిరావని నిషేధం విధించడమైంది. అయితే ఈ ఒప్పందంలో సంప్రదాయ అంతరిక్ష నియంత్రణ ఆయుధాలు, లేజర్లు, యాంటీ శాటిలైట్ ఆయుధాలు, కక్షలో తిరిగే ఇతర సైనిక పరికరాల గురించి ఎలాంటి ప్రస్తావన కానీ, నిబంధనలు కానీ లేవు. దీన్ని అవకాశంగా తీసుకుని అత్యంత ఆధునిక సాంకేతిక క్షిపణుల వినియోగంతో ఇప్పుడు ఈ ఒప్పందానికి అగ్రదేశాలు తూట్లు పొడుస్తున్నాయి.

దీనివల్ల అంతరిక్షంలో ఆయుధ పోటీ ప్రమాదకరంగా పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. చాలా కాలంగా కొన్ని దేశాలకు అంతరిక్షంలో ఆయుధ పోటీకి అవసరమైన సామర్థ్యాలు ఉన్నాయి. 1975 జనవరిలో సోవియెట్ యూనియన్‌కు చెందిన శాల్యూట్ 3 అంతరిక్ష కేంద్రంనుంచి రిమోట్‌గా 20 గుండ్లు పేల్చినట్ట బయటపడింది. 2007లో చైనా, 2019లో భారత్ భూమిపై నుంచి ప్రయోగించిన క్షిపణుల్లో తమకు చెందిన పనికి రాని ఉపగ్రహాలను ధ్వంసం చేశాయి. అయితే ఈ చర్యలేవీ 1967 నాటి అంతరిక్ష ఒప్పందాన్ని ఉల్లంఘించలేదు. చైనా, రష్యా అంతరిక్ష ఆధారిత ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సామర్థ్యాలను కూడా అభివృద్ధి చేశాయి. అయినా అంతరిక్షంలో అణ్వాయుధ పోటీ పూర్తి స్థాయిలో ప్రారంభమైనట్టు ఈ విషయాలు నిరూపించవు. అమెరికా అంతరిక్షంలో ఆయుధాలను మోహరించే ప్రణాళిక ఒక్క రాత్రిలో తీసుకున్న నిర్ణయం కాదు. ఈ ప్రక్రియ చాలా సంవత్సరాలుగా కొనసాగుతోంది. 2001 జనవరిలో అప్పటి అమెరికా రక్షణ కార్యదర్శి డొనాల్డ్ రమ్స్‌ఫెల్డ్ నేతృత్వం లోని అమెరికా స్పేస్ కమిషన్ తన స్వప్రయోజనాల కోసం స్వయంగా అంతరిక్ష విధానాన్ని సిఫారసు చేసింది. దీని ప్రకారం అమెరికా ప్రయోజనాలకు ఎదురయ్యే ముప్పును అడ్డుకోవడానికి, అవసరమైతే వాటిపై దాడులను సాగించడానికి వీలుగా అంతరిక్షంలో ఆయుధాలను మోహరించే అవకాశాన్ని అమెరికా అధ్యక్షుడికి కల్పించాలని సూచించింది. 2002లో అమెరికా యాంటీ బాలిస్టిక్ మిసైల్ (ఎబిఎం) ఒప్పందం నుంచి వైదొలగడంతో అంతరిక్ష ఆధారిత క్షిపణి రక్షణ వ్యవస్థలను అభివృద్ధి చేసే అవకాశం అమెరికాకు మరింత పెరిగింది. ఈ ప్రారంభ చర్యలు 2019లో డొనాల్డ్ ట్రంప్ తన మొదటి అధ్యక్ష పదవీ కాలంలో పుంజుకుని అమెరికా స్పేస్ ఫోర్స్ ఏర్పాటుకు దారితీశాయి.

సూర్యసేన
దినపత్రికలో
అన్నిరకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9951241048

# ఈ చట్టాన్ని చుట్టచుట్టి...

దేశంలో అన్నిరకాల అవినీతినీ అరికట్టేందుకు తీసుకునే చర్యలకు మొదటి మెట్టుగా రాజకీయ అవినీతిని అరికట్టేందుకు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఎంతో ఉపయోగకరంగా ఉండగలదని 1980ల నాటి కేంద్ర విజిలెన్స్ కమిషనర్ ఒకరు అభిప్రాయపడ్డారు. 1985 లో రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం తీసుకురావాలని సంకల్పించిన సందర్భంలో ఆ పెద్దాయన ఇలా వ్యాఖ్యానించారు. ప్రజాజీవన ప్రక్షాళనలో ఇది మొదటి అడుగు కాగలదని ఈ చట్టం తెచ్చిన ఆనాటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ఆశాభావం వ్యక్తం చేసారు. ఎంతటి బలమయిన చట్టాలనయినా తూట్లు పొడవగల సామర్థ్యం మన రాజకీయ పార్టీలకూ, ప్రజాప్రతినిధులకు ఉంటుందని ఆ ఇద్దరూ అప్పట్లో ఊహించి కూడా ఉండరు. అందుకే ఈ చట్టంవల్ల దేశానికి మంచి జరుగుతుందని ఆశించారు. దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను రక్షించి, దాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ చట్టం ఏర్పడింది. చాలాకాలం తర్జనభర్జనల తరువాత ఈ చట్టం వచ్చింది.

ఒక అంచనా ప్రకారం 1967, 1971 సార్వత్రిక ఎన్నికల్లో మన దేశంలో అటు లోక్‌సభకు గాని, ఇటు రాష్ట్రాల శాసనసభలకు గాని ఎన్నికైన దాదాపు నాలుగువేలమంది ప్రజా ప్రతినిధులలో యాభై శాతంమంది అంటే, దాదాపు రెండువేలమంది తాము గెలిచిన పార్టీ నుంచి ఫిరాయించి వేరే పార్టీలలో చేరినవారే. దీనివల్ల దేశంలో ఆ కాలంలో తీవ్రమయిన రాజకీయ సంక్షోభం నెలకొన్నది. ఈ కారణం చేతనే పార్టీ ఫిరాయింపుల్ని నిరోధించడానికి ఒక చట్టం తేవాలన్న ఆలోచన అప్పుడు మొదలై రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి అయ్యాక 1985 లో చట్టరూపం దాల్చింది. ఆ తరువాత 2003 లో అటల్ బిహారీ వాజపాయి ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో ఈ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు. ఈ సవరణలతో కూడిన చట్టం 2004 లో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి గా ఉన్న కాలంలో అమల్లోకి వచ్చింది.

ఈ చట్టం ప్రకారం అనర్హతకు గురైన మొట్టమొదటి ప్రజాప్రతినిధి మిజోరాం రాష్ట్రానికి చెందిన లాల్ దు హేమా. 1984లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికై 1986లో పార్టీ సభ్యత్వం వదులుకోవడంతో 88 నవంబర్ లో లోక్‌సభ స్పీకర్ ఆయనను అనర్హుడిగా ప్రకటించారు. ఈ చట్టం ప్రకారం అనర్హతకు గురైన తొలి శాసనసభ్యుడు కూడా లాల్ దు హేమానే. 2018లో మిజోరాం శాసనసభకు స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికైన హేమా తర్వాత మిజోరాం పీపుల్స్ మూమెంట్ పార్టీలో చేరడంతో 2020 లో అనర్హతకు గురయ్యారు. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికైతే ఏ రాజకీయ పార్టీలోనైనా చేరే స్వేచ్ఛ ఉంటుందని భ్రమ పడేవాళ్లకు ఇదొక గుణపాఠంగా ఉంటుంది.

ఇప్పుడెందుకు మనం ఈ పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని గురించి మాట్లాడుకుంటున్నాం? నిజానికి ఎనభై అయిదులో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తేవడం, ఆ తర్వాత దాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసే ఆలోచనతో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం 2003లో కొన్ని సవరణలు తీసుకురావడం, ఆ సవరణలతో కూడిన కొత్త చట్టాన్ని 2004లో కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ ప్రభుత్వం ఆమోదించి అమలులోకి తీసుకురావడం జరిగింది. ఈ ప్రక్రియను ఒకసారి గమనించినట్టయితే నాటినుండి నేటివరకు కూడా ఈ చట్టం తేవడం గాని, సవరణలు చేయడం గాని అన్నీ ఒక ప్రహసనంగానే కనిపిస్తాయి. ఈ మాట ఎందుకు అనవలసి వస్తున్నదంటే ఈ చట్టంలో ఉన్న లొసుగులను ఆధారంగా చేసుకుని ఈ నలభై ఏళ్ల కాలంలో దేశంలో దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు చట్టసభలలో తమ బలాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తే, వ్యక్తిగత ప్రయోజనాలో, అధికార ప్రాపకమో, మరొకటో ఆశించి చాలామంది ప్రజాప్రతినిధులు గోడదూకడం జరుగుతున్నందువల్ల. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఎవరికివారే తమకు అనుకూలమైన విధంగా అన్వయించుకున్నారు. ఆ క్రమంలో ఒక మంచి ఉద్దేశంతో మనం రూపొందించుకున్న చట్టాన్ని ఎవరి శక్తి మేరకు వారు తూట్లు పొడిచారు.




ఇక ప్రస్తుతానికి వస్తే శుక్రవారం రోజున తెలంగాణలో శాసనసభ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే శాసనసభ్యుడు దానం నాగేందర్ ఇందిరమ్మ ఇళ్ళ కేటాయింపు వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా శాసనసభ్యుల హక్కులకు భంగం వాటిల్లుతున్నదని, వాటిని పరిరక్షించే చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు నివేదిస్తున్న సమయంలోనే తెలంగాణ హైకోర్టు ఆయన శాసనసభ్యుడిగా అనర్హుడంటూ తీర్పును ప్రకటించింది. ఇది కచ్చితంగా ఒక చారిత్రకమైన తీర్పు. మిజోరాం ప్రజాప్రతినిధి లాల్ దు హేమా మొదలుకొని దానం నాగేందర్ వరకూ పార్టీ ఫిరాయింపుల నిరోధానికి జరిగిన ప్రయత్నాలు, చట్టంలోని లొసుగులను ఆధారం చేసుకుని తమకు అనుకూలంగా వాటిని మలుచుకుని రాజకీయ పక్షాలు తప్పించుకుపోయిన తీరును బట్టి కచ్చితంగా ఈ చట్టానికి కాలం చెల్లిందని, దీనిని చుట్టచుట్టి బంగాళాఖాతంలో పడేసి ఒక కొత్త చట్టాన్ని రూపొందించుకోవాల్సిన అవసరం చాలా ఉన్నదని మన రాజకీయ పార్టీలు, వాటి ద్వారా చట్టసభలకు ఎన్నికవుతున్న ప్రజా ప్రతినిధులు పదేపదే రుజువు చేస్తున్నారు.

ఫిరాయింపులకు ఒక చారిత్రక నేపథ్యం కూడా ఉన్నది. 1967 లో హర్యానా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన గయాలాల్ అనే శాసనసభ్యుడు ఒకేరోజున రెండు రాజకీయ పార్టీలలోకి మారాడు. అంతేకాదు, ఆయన పదిహేను రోజుల్లో మూడు పార్టీలు మారాడు. ఇది ఆనాడు దేశ రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. తరువాత అదే హర్యానా రాష్ట్రంలో 1980 లో జరిగిన ఒక మహా ఫిరాయింపు వల్ల పార్టీలు ఫిరాయించే వారికి 'ఆయా రాం గయా రాం' అనే పేరు స్థిరపడింది. గయాలాల్ వ్యక్తిగా పార్టీలు మారితే భజన్ లాల్ మొత్తం శాసనసభా పక్షాన్నే ఫిరాయింపజేసి ఫిరాయింపులకే కొత్త అర్థం చెప్పారు. ఎమర్జెన్సీ అనంతరం ఏర్పడిన జనతా పార్టీ ప్రభుత్వాన్ని హర్యానాలో కూడా ఏర్పాటుచేసి ముఖ్యమంత్రి అయిన భజన్ లాల్ 1980 మధ్యంతర ఎన్నికలలో ఇందిరాగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభంజనం వీచగానే మొత్తం బోర్డు తిప్పేసి శాసనసభాపక్షాన్నే ఫిరాయింపచేసాడు.

ఇన్ని ఘటనల కారణంగా వచ్చిన పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఆనాడే మరింత పకడ్బందీగా రూపొందించి ఉండాల్సింది. అందుకే ఇప్పుడు దాని స్థానంలో ఒక కొత్త చట్టం రావాల్సిన అవసరం ఉన్నది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారం న్యాయస్థానాల వరకూ వెళ్ళవలసిన అవసరం రాకుండా, సభాపతుల రాజకీయ మొహమాటాలకు తావు లేకుండా ఫిరాయించిన మరుక్షణం సభ్యత్వం కోల్పోయే విధంగా కొత్త చట్టం ఉండాలి. అదే జరిగితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డనాటి నుండి ఇప్పటివరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికార రాజకీయ పార్టీలు ఆడిన నాటకాలకు తెర పడుతుంది. ఉమ్మడి రాష్ట్రం విడిపోగానే ఇక్కడా అక్కడా అధికారంలోకి వచ్చిన పార్టీలు ఫిరాయింపుల విషయంలో విపరీత పోకడలకు పోయాయి. ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబునాయుడు ప్రతిపక్షంనుండి 23 మంది శాసనసభ్యులను కొంటే, తెలంగాణలో కె. చంద్రశేఖరరావు ఏకంగా తెలుగుదేశం శాసనసభ్యుడిని మంత్రివర్గంలో చేర్చుకుని తదుపరి ప్రతిపక్ష శిబిరాలను ఖాళీ చేసారు.

ఇక మళ్ళీ తెలంగాణలో ప్రస్తుత పరిస్థితికే వస్తే దానం నాగేందర్ శాసన సభ్యత్వాన్ని రద్దు చేసిన న్యాయస్థానం ఆయనతోబాటు భారత రాష్ట్ర సమితినుండి కాంగ్రెస్ కు ఫిరాయించిన మిగిలిన తొమ్మిదిమంది శాసనసభ్యుల విషయంలో ఏం చేస్తుంది అన్నది ఇప్పుడు కీలకంగా మారింది. నాగేందర్ కు, మిగిలినవారికి ఒక తేడా అయితే ఉంది. నాగేందర్ భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా శాసనసభకు గెలిచి వచ్చి ఆ తరువాత కొద్దిమాసాలకే కాంగ్రెస్ బీ ఫామ్ తీసుకుని ఆ పార్టీ టికెట్ మీద లోక్‌సభకు పోటీ చెయ్యడంతో పార్టీ ఫిరాయింపు రూఢీ అయింది. లోక్‌సభకు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన అంశం శాసనసభ పరిధిలోనిది కాదని సాంకేతికంగా అసెంబ్లీ స్పీకర్ ప్రసాదరావు తప్పించుకున్నారు. సాంకేతికత సరే నైతికత మాటేమిటి? బంతిని న్యాయస్థానం కోర్టులోకి నెట్టడం స్పీకర్ చేసిన పొరపాటు అనే అభిప్రాయానికి తావు ఇచ్చారు.

నాగేందర్ విషయానికి వస్తే పార్టీలు మారడం ఆయనకు కొత్తేమీ కాదు. చివరి నిమిషంలో కాంగ్రెస్ టికెట్ రాలేదని తెలుగుదేశం పార్టీకి, మళ్ళీ తన అభిమాన నాయకుడు ముఖ్యమంత్రి కాగానే తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. అధికారం కోల్పోయాక కాంగ్రెస్‌ను వీడి భారత రాష్ట్ర సమితికి, తిరిగి అధికారంలోకి రాగానే సొంత గూటికి అన్నట్టు కాంగ్రెస్‌కు పల్టీలు కొట్టారు. శాసనసభ్యుడిగా ఉండగా, అందునా సభ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే కోర్టు ఆయన మీద అనర్హత వేటు వెయ్యడం విశేషం. ఇప్పుడాయన తాను ఉప ఎన్నికకు సిద్ధం అంటున్నారు. ఆయననే అభ్యర్థిగా నిలబెట్టడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందా మరి? పార్టీగా కాంగ్రెస్ నుండి ఈ ఉదంతం మీద ఇప్పటికయితే ఎటువంటి స్పందనా లేదు. సుప్రీం కోర్టుకు వెళ్లనని దానం మొదట బీరాలు పలికారు. బహుశా న్యాయసలహాలు తీసుకున్న అనంతరం కాంగ్రెస్ పార్టీ మొట్టికాయలు వేసిన ఫలితమేమో, ఇప్పుడు ప్లేటు మార్చి సుప్రీం కోర్టు తలుపు తట్టారు. నాగేందర్ కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభకు పోటీచేసి ఓడిపోయిన సికిందరాబాద్ పార్లమెంట్ స్థానంలోనే ఆయన శాసనసభ్యుడిగా బిఆర్ఎస్ నుండి గెలిచిన ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో ఆ అసెంబ్లీ సెగ్మెంట్‌లో నాగేందర్ మీద గెలిచిన బిజెపి అభ్యర్థి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఎక్కువ ఓట్లు వచ్చిన విషయం గమనార్హం. ఎక్కడయినా అధికార పార్టీ ఉపఎన్నికను ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుందో తెలిసిన విషయమే. ఇక తెలంగాణలో ప్రతిపక్షాల విషయానికి వస్తే దానం అనర్హత వేటు మీద జనం హర్షం వెలిబుచ్చితే అర్థం ఉంది కానీ బిఆర్ఎస్, బిజెపి సంతోషంలో ఉక్కిరిబిక్కిరి కావలసిన అవసరం లేదు. ఆ రెండు పార్టీలు గురివిందను గుర్తు చేసుకుంటే మంచిది.

లాల్ దు హేమా నుండి దానం నాగేందర్ వరకూ ఈ అనర్హత వేట్లు చెదురుమదురు ఘటనలే. బోలెడుమంది తప్పించుకుపోతున్నారు, అందుకే కఠినమయిన చట్టం రావాలి.

# ద్వంద్వ నీతితో పరిష్కారాలా?

ప్రపంచంలోని సువిశాల సముద్రాల, జలసంధులు ఎవరికీ స్వంతం కావని, అవన్నీ స్వేచ్ఛా నౌకాయానానికి ఉపయోగపడవలసినవేనని అమెరికా గాని, యూరప్‌గాని, ఇండి యాగాని, పలు ఇతర దేశాలుగాని, నిజంగాని భావిస్తున్నాయా? లేక తమకు అవసరమైన సందర్భాలలో మాత్రమేనా? దక్షిణ అమెరికా, మధ్య అమెరికా, అట్లాంటిక్ ప్రాంతాలను అమెరికన్లు మన్రో డాక్ట్రిన్, డోన్రో డాక్ట్రిన్‌ల ద్వారా తమ జాగీర్లుగా ప్రకటించారు. ఆ ప్రాంతంలో ఏం చేస్తాం, ఏం చేయమన్నది తమ అధికారమేనన్నారు. అదే విధంగా ప్రవర్తిస్తున్నారు. తమకు నచ్చని వెనిజులా, క్యూబా వంటి దేశాలను సముద్ర మార్గాలలో దిగ్బంధం చేయటం ఇటీవలి దృష్టాంతాలే. మరొక వైపు పసిఫిక్‌ను గమనించినా అదే జరుగుతున్నది. ఉత్తరాన జపాన్ పశ్చిమ తీరం నుంచి, తూర్పు తీరం నుంచి దక్షిణ దిశగా ఫిలిప్పీన్స్ వరకు గల దీవుల సమూహాలను ఫస్ట్ ఐలాండ్ ఛెయిన్, సెకండ్ ఐలాండ్ ఛెయిన్ అంటూ ప్రకటించి, చైనా నౌకలు వాటిని దాటి రావటానికి వీల్లేదని వాదిస్తున్నారు. ఆ ప్రాంతమంతటా తమ కూటమి దేశాలలో సైనిక స్థావరాలను ఏర్పాటు చేసారు. కొన్ని మాటలు పదే పదే ప్రచారంలోకి వచ్చి నిజాలుగా భ్రమింపజేస్తాయి. ఇదొక సాధారణ సూత్రం. ఇది అంతర్జాతీయ వ్యవహారాలకు కూడా వర్తిస్తుంది. ఒక విషయం అట్లా భ్రమింపజేసినపుడు కొన్ని వాస్తవాలు మరుగున పడతాయి. ఆ ప్రచారాలు చేసే వారి ఉద్దేశం కూడా అదేనని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఉదాహరణకు స్వేచ్ఛా నౌకాయానం అనే విషయాన్ని చూద్దాము. ఈ మాట సాధారణ రూపంలో ఎప్పటినుంచో ఉన్నదే అయినా, ఇరాన్ యుద్ధ సందర్భంగా బాగా వాడుకలోకి వచ్చింది. ఆ మాట లోగడ వినని సామాన్య ప్రజలకు కూడా ఇపుడు తెలిసిపోయింది. అట్లా జరిగిన క్రమం ఏమిటి? ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ కలిసి గత ఫిబవరి 28న ఆకస్మిక దాడులు మొదలుపెట్టాయి. అది ఇరాన్ కాదు గదా అసలు ప్రపంచమే ఊహించని పరిణామం. అణు కార్యక్రమంపై వారితో చర్చలు జరుపుతూ, అవి సంతృప్తికరంగా కూడా ఉన్నప్పుడు మధ్యలో దాడులేమిటి?

ఇదంతా ఎన్నో మార్లు చర్చించిందే గనుక ఇక్కడ అందులోకి వెళ్లటం లేదు. కాని, రెండు మహాశక్తి వంతమైన సైన్యాలు దాడులు సాగించటంతో వెంటనే ఉత్పన్నమైన ప్రశ్న వారిని ఇరాన్ ఎట్లా తట్టుకుని నిలవగలదన్నది. అట్లా కొన్ని రోజులు గడిచేసరికి, అమెరికా, ఇజ్రాయెల్‌పై అప్పటికి తగినన్ని ఎదురు దాడులు జరిపిన ఇరాన్, ఇక అసమతుల యుద్ధానికి పాల్పడగలదనే మాట వినిపించింది. అసమతుల యుద్ధమనేది బలవంతునిపై బలహీనుడు సాగించే వ్యూహంగా ఎప్పటి నుంచో ఉన్నదే. అందరికీ తెలిసిన డేవిడ్ గోలియత్ పోరు అటువంటిదే. అటువంటి వ్యూహాన్ని అనుసరించి ఆఖరుకు బలహీనుడే గెలుస్తాడన్నది నీతి. ఆ ప్రకారం ఇరాన్ ఏం చేసింది? ప్రపంచానికంతా చమురు, ఇతర సరకులు రవాణా అయే హర్మూజ్ జలసంధిని మూసివేసింది. దానితో ఇంధన కొరతలు ఏర్పడి, ఇంధనంతోపాటు ఇతర సరకులు ధరలు పెరిగి అందరూ విలవిలలాడారు. అమెరికాపై ఒత్తిడి పెరిగింది. కొన్ని వారాల వెనుక ముందుల తర్వాత దాడులు ఆపివేసారు. అడపాదడపా తప్పి. అనగా, ఇరాన్ అసమతుల యుద్ధ వ్యూహం ఫలించిందన్న మాట. ఇక్కడ ఒక విశేషం చెప్పాలి. పైన ప్రస్తావించిన డేవిడ్ గోలియత్ పోరు కథ పుట్టింది ఇజ్రాయెల్ వారి శత్రువులైన ఫిలిస్టీనియన్ల గురించే. ఫిలిస్టీనియన్లు పాలస్తీనియన్లు వేరు. కాని ప్రాంతం అదే. ఈ కథ బైబిలులోనిది. అప్పటి అసమతుల యుద్ధంలో గోలియత్‌ను చిత్తు చేసిన డేవిడ్, ఇజ్రాయెల్ పక్షానికి చెందినవాడు. ఈ కథ ఇప్పుడు విచిత్రంగా తిరగబడింది. ఇజ్రాయెల్ గోలియత్‌గా మారగా ఇరాన్ డేవిడ్ పాత్ర ధారి అయింది.

ఇదంతా రాయటం ఎందుకంటే హర్మూజ్ జలసంధిని ఇరాన్ తన అసమతుల యుద్ధ వ్యూహంలో విజయవంతగా ఉపయోగించుకుంటున్నది. తాజాగా, వారి మిత్ర సంస్థ అయిన హూతీలు బాబ్ అల్ మందెబ్ జలసంధిని అదే విధంగా ఉపయోగించటం మొదలుపెట్టారు. దానితో అమెరికా, ఇజ్రాయెల్ తోపాటు వారి మిత్ర దేశాలైన అరబ్ రాజ్యాలు కూడా దిక్కుతోచని స్థితి లోనవుతున్నాయి. ఇదంతా వివరిస్తూ ఇక్కడ చెప్పదలచింది ఏమంటే, ఈ పరిణామాలు సమస్తం ప్రపంచ దేశాలన్నింటికీ స్పష్టంగా తెలిసినదే. ఇందులో నేరం ఇరాన్ ది కాదనీ, అమెరికా, ఇజ్రాయెల్‌లది అని తెలిసిందే. కాని ప్రధాని మోడీ ప్రభుత్వం సహా అత్యధికులు, స్వేచ్ఛాయుత నౌకాయానాన్ని ఆపివేసిందంటూ ఇరాన్‌ను ఆక్షేపించటం చేస్తున్నారుగాని, ఆ పరిస్థితి ఉత్పన్నమవటానికి కారణమైన అమెరికా, ఇజ్రాయెల్‌లను నిందించటం లేదు. వారిది ఏ విధంగా చూసిన అక్రమ యుద్ధమని, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, అందువల్ల వెంటనే ఆపివేసి హర్మూజ్ ద్వారా మునుపటి వలెనే స్వేచ్ఛా నౌకాయానానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేయటం లేదు. ద్వంద్వ నీతి అంటున్నది సరిగా దీనినే. కనుకనే సమస్య పరిష్కారం కావటం లేదు. హర్మూజ్ మొదటినుంచి ఎల్లప్పుడూ స్వేచ్ఛా నౌకాయానికి తెరిచే ఉన్నదని, దానిపై హక్కులు తనవంటూ ఇరాన్ ఎన్నడూ అనలేదని, కేవలం అమెరికా, ఇజ్రాయెల్‌ల దాడుల వల్లనే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని చివరకు అమెరికన్ మీడియా, మేధావులు కూడా ఎత్తిచూపుతున్నారు. కాని ఆ నిజాయితీ, ధైర్యం మోడీ ప్రభుత్వానికి ఎందుకు ఉండటం లేదు? గత వారం ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ బ్రిక్స్ సమావేశాల కోసం ఢిల్లీ వచ్చినప్పుడు కూడా ఆ పని చేయలేదు. ఇండియాకు తక్కిన ప్రపంచానికి ఇంధనం కీలకమనటంలో భిన్నాభిప్రాయం ఉండదు. కాని, దాడులకు గురవుతున్న ఇరాన్‌కు ఏకైక ఆత్మరక్షణగా మిగిలిన ఆ జలసంధిపై నియంత్రణను వదులుకొమ్మనటం వల్ల వారి రక్షణకు మరొక ప్రత్యామ్నాయ రక్షణ ఏదైనా చూపుతున్నామా? లేక మీరు పరాజితులై అమెరికా, ఇజ్రాయెల్‌లకు లొంగిపోయినా సరే మాకు స్వేచ్ఛాయానాన్ని కల్పించండని అంటున్నామా? ఇరాన్ తరహా క్లిష్ట స్థితి మనకే ఎదురవుతే ఏ వైఖరి తీసుకుంటాము? ఇటువంటి ద్వంద్వ నీతే, నిజాయితీ లేనితనమే అమెరికా దుశ్చర్యలకు మరింత ఉపయోగపడుతున్నది.




# విశేష అన్న ప్రసాద వితరణ

**– శేషాద్రి నగర్ కాలనీ**
**వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కాచా సోమయ్య**

**రంగారెడ్డి, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** శంషాబాద్ జోన్ పరిధిలోని మహేశ్వరం నియోజకవర్గం అల్మాస్గూడ, శేషాద్రి నగర్ రోడ్ నెంబర్ 5 లో, వినాయక విగ్రహ సమీపంలో శేషాద్రి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కాచసోమయ్య ఆధ్వర్యంలో విశేష అన్నదానం ఆదివారం నిర్వహిస్తున్నట్లు శేషాద్రి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సోమయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల కాలనీవాసులంతా హాజరై అన్నప్రసాద వితరణలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరవుతారని పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ఆమెకు స్వాగతం పలకాలని కోరారు.

# పోషణపై అవగాహన కల్పించిన అంగన్వాడీ సిబ్బంది



**గరిడేపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** కీతవారిగూడెం అంగన్వాడీ కేంద్రం--2లో పోషణ మాసం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. పుట్టిన శిశువులకు తల్లిపాల ప్రాముఖ్యత, తల్లిపాలు అందించడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తల్లులకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ టీచర్ మల్లమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, వైద్యాధికారి డాక్టర్ సుష్మా, ఏఎన్ఎం రాజకుమారి, ఆశ కార్యకర్తలు రాంబాయి, సుధ, ఈశ్వరమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే పోషణ మాసం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

# నేటి సమాజానికి నైతిక దీపాలు గ్రాండ్ పేరెంట్స్

(సెప్టెంబర్13 నుండి 20తేదీ
వరకు జాతీయ తాతా బామ్మల
(గ్రాండ్ పేరెంట్స్ వీక్)
వారోత్సవాల సందర్భంగా)

ఉరుకుల పరుగుల నేటి జగత్తులో
పచ్చని నీడలు తాతయ్యలు
ఆధునిక కాలపు అల్లరి ముందర
ఆదర్శమూర్తులు అమ్మమ్మలు
నానమ్మలు

సెల్ ఫోన్ లోనే లోకం చూసే
పిల్లల చేతిని తాకాలి
కనుమరుగవుతున్న కథలను
చెప్పి కమ్మని విలువలు నేర్పాలి

తాతలు (బామ్మలు) అమ్మమ్మ
నానమ్మలు చెప్పే కథలు
మనుమలకు మనుమరాళ్లకు
రేపటి జీవిత పాఠాలు
నీతి కథలు రేపటి తరానికి
వ్యక్తిత్వ వికాస పాఠాలుగా
మారిపోతాయి

అమ్మ నాన్నలు ఉద్యోగాలలో
అలిసి సొలసి ఇల్లు చేరితే
పిల్లల బాధ్యత భుజానవేసి
భరోసా ఇచ్చే తోడవ్వాలి

నేను నిన్ను ఎన్నటికీ మరువను
అంటూ పెద్దల ప్రేమే మనకు
రక్షణ కావాలి
పాతకాలపు అనుభవాలే
కొత్తతరానికి ఆస్తిగా పంచాలి

కోపాలు తగ్గించి స్నేహం పెంచి
మనుమల మనుమరాళ్ల
మనుషులు గెలవాలి
పాతకాలపు అనుభవాలే
కొత్త తరానికి పంచాలి

బడి నేర్పని ఎన్నో పాఠాలు
ఒడిలోనే సులువుగా చెప్పాలి
నేటి సమాజపు మార్పులు
గమనిస్తూ నైతిక రక్షణగా
నిలవాలి

తాత బామ్మలు అత్యుత్తమ
గుణాలు నైతికత మానవీయ
విలువలను ప్రేమగా అవలీలగా
ఉచితంగా ఆసక్తికరంగా నేర్పే
మేధావులని గుర్తించుకోవాలి

గ్రాండ్ పేరెంట్స్ అంటే కేవలం
వృద్ధులు కాదు. వారు మన
సంస్కృతికి వారథులు .

2026 అంతర్జాతీయ థీమ్
వృద్ధాప్యంలో ఓరి ఒంటరిగా
వదిలేయకుండా మిమ్మల్ని
ఎన్నటికీ మరువము అనే
నమ్మకాన్ని మనం ఇవ్వాలి.

నేటి సమాజంలో
తల్లిదండ్రులు బిజీగా
ఉన్నప్పుడు
పిల్లలను పెంచే
బాధ్యతలో భాగస్వాములు
అవుతూనే వారికి డిజిటల్
ప్రపంచంలో డిప్రెషన్ కు
లోను కాకుండా మానసిక
స్థిరత్వం అందించే గొప్ప శక్తి
కేవలం తాతయ్య అమ్మమ్మలకే
నానమ్మలకే ఉంది.

తాత బామ్మలను గుండెల్లో
పెట్టుకొని చూసుకోవాలి

పెద్దలను గౌరవిస్తూ వారి
మార్గదర్శకత్వం లో పిల్లలను
పెంచినప్పుడు సమాజం
ఆరోగ్యకరంగా ఉంటుందనే
సత్యాన్ని సమాజం గుర్తించాలి.




**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు**
**తెలంగాణ ఎద్యుకేషన్ ఫోరం**
**రచయిత కాలమిస్ట్**
**కరీంనగర్**
**9440245771**

# వినాయక నిమజ్జన ఏర్పాట్లు మధ్యాహ్నంలోగా పూర్తి చేయాలి......

**– అన్ని నిమజ్జన ప్రదేశాల్లో పటిష్ట ఏర్పాట్లు.. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశాలు**

**నల్గొండ ప్రతినిధి, సెప్టెంబర్ 20 (సూర్య సేన) :** జిల్లావ్యాప్తంగా వినాయక నిమజ్జనం నిర్వహించే అన్ని ప్రదేశాల్లో ఈనెల 20వ తేదీ మధ్యాహ్నంలోగా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. సంబంధిత తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని నిమజ్జన ప్రదేశాలను సంయుక్తంగా పరిశీలించి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్డీవోలు నిమజ్జన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని చర్యలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ప్రతి నిమజ్జన ప్రదేశానికి వచ్చే వినాయక విగ్రహాల వివరాలతో జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. చెరువులు, కాలువలు, కుంటల్లో ఎవరికి వారుగా వెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేయకుండా, అధికారులు గుర్తించిన నిర్దేశిత ప్రాంతాల్లోనే నిమజ్జనం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి నిమజ్జన ప్రదేశంలో సంబంధిత శాఖల సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా విధులను విభజించి పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్ కేంద్రాల్లో నియంత్రణ గదులను ఏర్పాటు చేయాలని, వివిధ శాఖల సిబ్బందితో పాటు ఆపదమిత్ర, స్వచ్ఛంద సేవకుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. స్వచ్ఛంద సేవకులకు ప్రత్యేక దుస్తుల విధానం ఏర్పాటు చేయాలని తెలిపారు. నిమజ్జనం పూర్తయిన వెంటనే విగ్రహాలను తొలగించేలా గజ ఈతగాళ్లతో పాటు పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇందుకోసం నాలుగు రోజుల పాటు నిరంతర విధులు నిర్వహించేలా సిబ్బందిని నియమించాలని చెప్పారు. ప్రతి నిమజ్జన ప్రదేశానికి అర కిలోమీటరు పరిధి వరకు తగినంత విద్యుత్ దీపాల ఏర్పాటు చేయాలని, ప్రతి నిమజ్జన కేంద్రంలో సహాయ కేంద్రంతో పాటు మైక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు ప్రమాదకరంగా లేదా వేలాడుతూ ఉంటే వెంటనే వాటిని సరిచేయాలని ఆదేశించారు. నిమజ్జనానికి వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, అవసరమైన చోట్ల సూచికలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ సబ్‌కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి, ఆర్డీవోలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



# పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై ఎఫ్‌సీఐ ప్రత్యేక శ్రద్ధ





**– స్వచ్ఛతా హి సేవా--**
**2026లో భాగంగా నల్గొండలో వైద్య ఆరోగ్య శిబిరం**

**నల్గొండ ప్రతినిధి, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నల్గొండలోని ఎఫ్‌సీఐ డివిజనల్ కార్యాలయం, బీఎస్‌సీ నల్గొండలో శనివారం ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. 'స్వచ్ఛతలో భాగస్వామ్యం--స్వచ్ఛ భారత్, వికసిత భారత్' అనే సందేశంతో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవా--2026 కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నల్గొండ రివర్ నిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. సమాజ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న వారి ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. వైద్య శిబిరంలో పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యం, పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, వ్యాధుల నివారణ, ఆరోగ్య పరిరక్షణపై వైద్యులు అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి అవసరమైన వైద్య సూచనలు, ఆరోగ్య సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ సీనియర్ అధికారులు కృష్ణమూర్తి, రత్నస్వప్న, ఏడుకొండలు, రాకేష్, ఉద్యోగులు బాబీ నాయక్, క్రాంతి, సతీష్‌రెడ్డి, రాఘవేంద్ర, జనార్దన్, అజయ్, రాజు, హమాలీల ప్రతినిధి లతీఫ్ తదితరులు పాల్గొన్నారు

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ఉత్తమ్ లక్ష్యం : గుత్తా సుఖేందర్ రెడ్డి






**సూర్యాపేట / కోదాడ, సెప్టెంబర్ 19 (సూర్య సేన):** తెలంగాణలో ఏ ప్రాంతంలో నిరుద్యోగులుగా ఉన్న యువతకైనా ఏ విధంగానైనా ఉపాధి కల్పించాలని, ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలనే తపనతోనే మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇంత పెద్ద జాబ్ మేళా కార్యక్రమాన్ని చేపట్టారని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.

కోదాడ సీసీ రెడ్డి కన్వెన్షన్ లో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని తీసుకొని మా అందరినీ ఆహ్వానించి, యువతను కలుసుకునే అవకాశం కల్పించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తు న్నానని అన్నారు. ఈ సంవత్సరం వారు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నా.. తీవ్రమైన ప్రభావంతోనే మన ప్రాజెక్టులు నిలబడ్డాయన్నారు. చాలా మంది రైతాంగం ఇంకా రెండు పంటలు వేయాలని ఎదురు చూస్తున్నారని, 24 గంటలు వేసిన పంటలను ఏ విధంగానైనా కాపాడాలనే తపనతోనే శాఖ మంత్రిగా పనిచేస్తున్నారని కొనియాడారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో వడ్లు కొనుగోలు చేసిన ఘనత ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి నేతృత్వంలో, అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కిందని తెలిపారు. తాము ఎప్పటికప్పుడు మంత్రి ఉత్తమ్ తో చర్చిస్తూ ఉంటామని, ఎక్కడ నోట్ల పాటలు ఉన్నాయి, ఏం చేద్దాం అనే అంశాలపై మాట్లాడుకుంటామన్నారు.

అందరి లక్ష్యం తెలంగాణ రాష్ట్రంలో రైతుల సమగ్ర అభివృద్ధి, ప్రజల సమగ్ర అభివృద్ధి కోసం పనిచేయడమేనని ఈ సందర్భంగా మనవి చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రైల్వే లైన్ కోసం ఉధృతంగా సాగుతున్న పోస్ట్ కార్డు ఉద్యమం

**భానుపురి, సెప్టెంబర్ 19 (సూర్య సేన):** లక్ష కార్డుల ఉద్యమం తలపెట్టిన నేపథ్యంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు.అందులో భాగం గా రైల్వే సాధన సమితి నిర్వాహకులు డేగల జనార్ధన్, చింతల పాటి చిన శ్రీరాములు, రాచూరి ప్రతాప్,సముద్రాల రాంబాబు,మంజుల తదితరులు చురుకుగా పాల్గొని ఉత్తరముల పై సంతకాల సేకరణలో బిజీగా ఉన్నారు. శనివారం వరకు సుమారు 10 వేల కార్డ్స్ పై సంతకాలు సేకరించినట్లు నిర్వహకులు తెలిపారు. రైల్వే సాధన కొరకు జరుగుతున్న ఈ ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి అని తెలిపారు.




# ప్రిలిమినరీ పరీక్షకు కొత్త దరఖాస్తు లింక్

**– ఇప్పటివరకు దరఖాస్తు**
**చేసుకోని అభ్యర్థులు మాత్రమే నమోదు చేసుకోవాలి**

**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 20 (సూర్య సేన) :** నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 20న నిర్వహించనున్న ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి కొత్త దరఖాస్తు నమోదు గూగుల్ షీట్ లింక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పోలీస్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని కొత్త అభ్యర్థులు మాత్రమే ఈ కొత్త లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించింది. అభ్యర్థులు తమకు సంబంధించిన వివరాలను పూర్తిగా, తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలని పోలీస్ శాఖ పేర్కొంది.

ఇప్పటికే సెప్టెంబర్ 18న దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ కొత్త లింక్ ద్వారా నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరోసారి నమోదు చేసుకుని గందరగోళానికి గురికావద్దని, కొత్తగా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మాత్రమే అందుబాటులోకి తీసుకొచ్చిన కొత్త గూగుల్ షీట్ లింక్‌ను వినియోగించుకోవాలని నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ సూచించింది.




# శ్రీ సాయిగ్లోబల్ మల్టీ బ్రాండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

భానుపురి, సెప్టెంబర్ 19: శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ సాయిగ్లోబల్ యాజమాన్యం మట్టి వినాయకున్ని ప్రతిష్ఠించి అన్నప్రసాద వితరణ చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేధిత లక్ష్మాది అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జనగాం క్రాస్ రోడ్డులోని శ్రీ సాయి గ్లోబల్ మల్టీబ్రాండ్ సర్వీసెస్ లో నిర్వహకులు దారపునేని శ్రీనివాస రావు ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆమె అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూ సాంప్రదాయాల్లో అన్నదానాన్ని మహాదానంగా భావిస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరు భక్తిమార్గాన్ని ఎంచుకోవడంతో మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రాపర్తి భవానిశ్రీనివాస్, సర్పంచ్ లావుడ్యా శ్రీలతబాలాజీ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస నాయుడు, వల్లెం శేఖర్, కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, రేపాల శ్రీనివాస్, గొట్టిపర్తి శ్రీకాంత్, దారపునేని వెంకటేశ్వర్లు, రాజేందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆడబిడ్డల పుష్పార్చనం ఆటపాటల సమర్పణం ..... బొడ్డెమ్మ పండుగ



తెలంగాణములో ఆడబిడ్డలు పూర్వాచార సదాచార సంపన్నంగా కోలాటాలు, ఆటపాటలు, భజనలు, బృందనృత్యాలతో నయనానందభరితంగా జరుపుకునే వేడ్కలలో బొడ్డెమ్మ పండుగ శశిరాయమానంగా తలమానికంగా నిలుస్తుంది. దీనినే పూబోడుల పండుగగా, బొడ్డెమ్మల పున్నమిగా లోకవ్యవహారంలో జానపదుల జనశృతిలో పేరేన్నిక గన్నది. బొడ్డెమ్మ ప్రకృతి రమణీయతకు పట్టంకట్టే అచ్చమైన అడవి పూలపండుగ. ప్రకృతి ఆరాధనకు ఆలంబనగా నిలిచే జానపదుల ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, పల్లెజీవన సొబగులకు నిరుపమానంగా కొనియాడదగినది బొడ్డెమ్మ పండుగ.

బతుకమ్మకు పూర్వరంగమైన బొడ్డెమ్మ ఆట వినాయకచవితి మరుసటి రోజు అనగా భాద్రపద బహుళ పంచమి రోజున ప్రారంభమై మహాలయ అమావాస్య నాటికి ముగిస్తుంది. బొడ్డెమ్మ ఆటలో ఎర్రమట్టి ముద్దను త్రిభుజాకారంగా ఆకృతి నిల్పి, దానిపై వెంపలిచెట్టు కొమ్మను వేంచేపుచేసి పసుపు కుంకుమలతో అలంకరించి, బొడ్డెమ్మగా సమర్చన చేసి సాయంసంధ్యావేళలో బాలికలు, విశేషించి పెళ్ళి కావాలని ఆకాంక్షించే కన్యలు వలయాకారంలో తిరుగుతూ హృదయోల్లాసంగా ఆడుతూ పాడుతూ సందడి చేస్తారు. ఇలా భాద్రపద బహుళ పంచమి నుండి మహాలయామావాస్య పర్యంకం 9 రోజుల పాటు అంగరంగ వైభవంగా, అవధులు లేని ఆనందం వెల్లివిరిసేట్టుగా చప్పట్లు, కోలాటాలు, భజనలతో పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ, బృందనృత్యాలను చేస్తూ ఆహ్లాదకరమైన రసామ్నాయమైన ప్రకృతి ప్రశాంత వాతావరణంలో చెరువులు, సెలయేటి గలగలలు సవ్వడుల నడుమ బొడ్డెమ్మను వేడ్కగా జరుపుకొని మహాలయ అమావాస్య నాడు సాయంసంధ్యావేళలో ప్రసన్న గంభీరమైన తటాకములో బొడ్డెమ్మలను నిమజ్జనం చేసి, వెంట తెచ్చుకున్న ప్రసాదాన్ని ఒకరికొకరు వాయనాలిచ్చుకుని ఇంటికి తిరిగి వెళ్ళి మనఃప్రీతిపూర్వకంగా సేదదీరుతారు. ఆ తెల్లవారి నుండి బతుకమ్మ పండుగ శ్రీకారం చుట్టుకోవడం గమనార్హం.

అడవి నుండి సేకరించిన పుట్టమన్నును, చెరువు మట్టిని, ఎర్రమన్నును చతురస్రాకారపు చెక్కపీటపై 5 దొంతరులుగా, సోపానాలుగా, అంతస్తులుగా ఉండేట్లుగా వలయాకారంలో బొడ్డెమ్మను తయారు చేస్తారు. దీన్ని ఎర్రమట్టితో అలికి బియ్యపు పిండి, కుంకుమ, పసుపులతో భవ్యంగా, దివ్యంగా అలంకరించి దానిపై శోభాయమానంగా రంగవల్లికలను తీర్చిదిద్దుతారు, బొడ్డెమ్మ ఐదు దొంతరలు, అంతస్తుల శిఖరం చూడడానికి గోపురం ఆకృతిలో కనువిందు చేస్తుంది. ఇలా ఐదు సోపానాలుగా అలరిన శిఖరాగ్రంపైన కలశం పెట్టి అందులో బియ్యం పోసి దానిపైన నూత్న రవికవస్త్రంతో చుట్టి ఆపైన చుట్టుగా మామిడిఆకులతో తోరణం చుట్టి కలశం మధ్యలో తమలపాకులపై త్రిభుజాకారంగా చేసిన పసుపుమద్ద గౌరమ్మను వేంచేపు చేసి అర్చించడమే బొడ్డెమ్మ పర్వం రూఢి చేస్తున్నది. బొడ్డెమ్మకు ఉదయం ఇంట్లో ఆరాధన చేసి, సాయంవేళ ఇంటి తొలివాకిలిలో గోమూత్రం, గోమయంతో అలుకుచల్లి చుక్కల ముగ్గులు వేసి సాయంకాలం పూసే ఉద్రాక్ష, బీర, మల్లె,, కలువ, తామర, పద్మం, జాజిపూలతో అలంకరించిన పీట బొడ్డెమ్మను తెచ్చిపెట్టి ధూపదీపాలను సమర్పించి పెళ్ళికావాల్సిన కన్యకలు, బాలికలు చుట్టుగా ప్రదక్షిణ పథంలో తిరుగుతూ "బొడ్డెమ్మా బొడ్డెమ్మా కోల్ ... బిడ్డాలెందరూ కోల్...",

"బొడ్డెమ్మ బొడ్డెమ్మ ఉయ్యాలో
నీ బిడ్డ పేరేమి ఉయ్యాలో!
నీ బిడ్డ నీలగౌరు ఉయ్యాలో!
నిచ్చుమల్లే చెట్టేసి ఉయ్యాలో!
చెట్టుకు చెంచెడు ఉయ్యాలో!
నీళ్ళైనా పోసే ఉయ్యాలో!
కాయలు పిందేలు ఉయ్యాలో!
గగనమై ఎగిసే ఉయ్యాలో!....

అంటూ కోలాటాలు, చప్పట్లతో, పాటలు ఆటలతో బృందనృత్యాలు చేస్తారు. చివరగా బొడ్డెమ్మను నిద్రపుచ్చే సన్నివేశంగా ఆర్ద్రరసార్ణవంగా పాడే పాటలు చరమాంకంలో ఇలా ఉంటాయి.

"నిద్రపో బొడ్డెమ్మా నిద్రపోవమ్మా!
నిద్రాకు నూరేళ్ళు నీకు వేయేళ్ళు!"
"నినుగన్న తల్లీకీ నిండా నూరేళ్ళు!"

అంటూ నోరారా, మనసారా పాడి, ఆడిన తర్వాత ఎంతో భక్తితత్పరహృదయంతో తెచ్చుకున్న సద్దులను ఆప్యాయంగా పరస్పరం నువ్వులుబెల్లం, పప్పుపొడులను ఇచ్చి పుచ్చుకున్న పిమ్మట పునః బొడ్డెమ్మను ఇంట్లో పూజాగదిలో జాగ్రత్తగా వేంచేపు చేసి వెళ్తారు. ఇలా తొమ్మిది రోజులు కొనసాగించిన పిమ్మట మహాలయామావాస్య నాడు "పోయిరా బొడ్డెమ్మ పోయిరావమ్మా"... అంటూ నీటిలో జారవిడుస్తూ ఆడబిడ్డలు బొడ్డెమ్మలను ఆదరంతో సాగనంపుతూ నిమజ్జనం చేయడం పరిపాటిగా వస్తున్న ఆచారం.

పెళ్ళీడుకొచ్చిన కన్యలు అందంగా అలంకరించుకొని కోలాటాలు వేస్తూ పాటలు పాడుతూ అలసేదాకా ఆడుతారు. బొడ్డెమ్మ పండుగ పాటలలో ప్రముఖ ప్రాచుర్యం పొందినవిగా చెప్పుకునే పాటల్లో...

బొడ్డెమ్మా బొడ్డెమ్మా కోల్
బిడ్డాలెందారూ కోల్!
నీబిడ్డ నీలగౌరూ కోల్
నిత్యమల్లే చెట్టేసీ కోల్!
పొడలా పొడలా గట్ల నడుమ ఓ రాచగుమ్మాడీ...
ఆకుచిన్న అడవిలోనా ఓ రాచగుమ్మడీ...
నాకు చిన్న దండా దొరికే ఓ రాచగుమ్మడీ!...
బొడ్డెమ్మ బొడ్డెమ్మ ఉయ్యాలో
నినుపూజింతూనమ్మా ఉయ్యాలో!
భక్తి తోడనూ కొల్తూనమ్మా ఉయ్యాలో



నిను మనసారా సేవింతూమూ ఉయ్యాలో!...
నిద్రకూ నూరేండ్లు, నీకు వేయేండ్లు...
నిను గన్న తల్లికీ నిండ నూరేండ్లు!...
నిదురపో బొడ్డెమ్మ నీకు నూరేండ్లు...
నిదురపో మాయమ్మ మమ్ము కన్న తల్లీ!..

బొడ్డెమ్మలను ప్రధానంగా నాలుగు రకాలుగా తయారు చేస్తారు. వాటిలో పీటబొడ్డెమ్మ, గుంటబొడ్డెమ్మ, పందిరిబొడ్డెమ్మ, బాయి(వి) బొడ్డెమ్మ, అంతరాల బొడ్డెమ్మ అనే రీతులలో ఐదు విధాలుగా, ఐదు రూపాలుగా తీర్చిదిద్దిన రూపురేఖలను నేపథ్యంగానే సార్థక నామధేయంగా ప్రసిద్ధి చెందింది. పీట మీద పూజించే బొడ్డెమ్మను పీటబొడ్డెమ్మ అనీ, గుంటాకృతిలో పూజిస్తే గుంటబొడ్డెమ్మ అనీ, పందిరిలా అలంకరిస్తే పందిరిబొడ్డెమ్మ అనీ, బావి (బాయి) వలె గొయ్యిలాగా తయారు చేసే బొడ్డెమ్మను బాయిబొడ్డెమ్మ అని, సోపానాకృతిలో చతురస్రాకారంలో చేసే బొడ్డెమ్మను అంతరాల బొడ్డెమ్మ ( సోపానాల బొడ్డెమ్మ ) అని పిలిచే కొలిచే సంస్కృతి ఉన్నది.

ఐతే బొడ్డెమ్మలను తయారు చేసిన విధమును అనుసరించి వాటి రూపం, ఆకృతి, ఆకారం, రూపురేఖలు దాల్చిన నేపథ్యంగా భిన్న, విభిన్న రూపాలు ఏవైనప్పటికీ అర్చన క్రతువు, పూజాసంవిధానం మాత్రం ఒకే విధంగా ఉంటుంది. ఐతే బాలికలు వీటన్నింటిలో ఎక్కువగా పీట బొడ్డెమ్మను ఎక్కువగా సేవించి తరిస్తుంటారు. ఈ ఋతువులో లభ్యమయ్యే ఔషదీయ గుణములతో ఒప్పారే అందమైన తీరొక్కరంగురంగుల పూలను అలంకృతిగా పేర్చి, ఆపైన సమర్చనగా గౌరమ్మను పూజించడం అటు పుడమితల్లిని, ఇటు జగజ్జనని పరమేశ్వరిమాతను ఆరాధించడమే బొడ్డెమ్మ పండుగ ముఖ్యోద్దేశం. భూదేవి జలకళతో పసిమి గల పంటలనిచ్చినందుకు తార్కాణంగా సభక్తికంగా, సద్భక్తితో వెంపలిచెట్టు కొమ్మను బొడ్డెమ్మపై నాటి ఆడబిడ్డలు కలిసి సామూహికంగా తాళబద్ధంగా, గానయోగ్యంగా బృందనృత్యవిన్యాసాలతో సందడిగా సాయంసంధ్యావేళలో చెరువుల దరుల చెంత "ఉయ్యాలో, కోల్, వలలో, ఓ రాచగుమ్మడీ, చందమామ"...

అనే మకటాలతో పల్లవి, అనుపల్లవి, చరణంలతో సాగే గేయాలను సంగీతాత్మకంగా లయాత్మకంగా , తాళబద్ధంగా, గానయోగ్యంగా... ఆడిపాడడం ఆటవిక గిరిజన బిడ్డల ప్రకృత్యారాధనలలో సృజనాత్మక రసాత్మక కళాత్మక దృష్టికి ప్రతీకగా నిలుస్తుంది. బతుకమ్మ బిడ్డే






బొడ్డెమ్మ అనీ జానపదుల ప్రగాఢ విశ్వాసం.

అందుకే దీర్ఘసుమంగళిగా ఉండాలనే అభిలాషతో స్త్రీలు, శీఘ్రమే కల్యాణప్రాప్తి చేకూరాలని, మంచి భర్త దొరకాలనే ఆకాంక్షతో కన్నెపిల్లలు మంగళగౌరికి గౌరమ్మగా వ్రతనిష్ఠతో అటు అమ్మాయిలు, ఇటు అతివలు వానాకాలంలో భాద్రపదమాసంలో సాయంసంధ్యాసమయంలో అచ్చంగా ప్రకృతి ఆరాధనగా అతివలు ఆచరించే పువ్వుల ఆరాధనలు, ఆటపాటల బృందాగానార్చనలు, కోలాటాలు చప్పట్ల సవ్వడుల నడుమ సాగే పూజాక్రతువులే పిల్ల బొడ్డెమ్మ, పెద్ద బతుకమ్మ పండుగలు అని ఆర్యోక్తి.

వానాకాలంలో వచ్చే బొడ్డెమ్మ పండుగ నేపథ్యంలో విరివిగా పండిన పప్పుధాన్యాలు పెసర్లు, కందులు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్నలు, శనగలు, మంచిశెనగలు, నువ్వులను లేలేతగా వేయించి పొడిచేసి ఫలహారం చేసి గౌరమ్మకు నైవేద్యంగా సమర్పించి, తదనంతరం శిఖరాయమానంగా అమ్మాయిలు అందరూ తెచ్చుకున్న ఫలహారాలు, ప్రసాదాలను వాయనాలుగా ఒకరికొకరు ఇచ్చుకొంటి వాయనం, పుచ్చుకొంటి వాయనం అంటూ రకరకాలైన బెల్లం, శర్కర కలిపిన నువ్వులు పుప్పులపొడులను మనసా వచసా అభివాదాలు చేసుకుని స్వీకరించి తమ తమ నివాసాలకు చేరుకుంటారు. అందుకే బొడ్డమ్మ అచ్చమైన జానపదుల పండుగగా సత్సంప్రదాయ పూర్వాచార సదాచారంగా వైభవోపేతంగా పరిఢవిల్లుతుండడం ముదావహం.

జీవనసాఫల్యపురస్కృతులు, సాహితీ సవ్యసాచి
తూపురాణి వేంకటకృష్ణమాచార్యులు
తెలుగు ఉపన్యాసకులు
ప్రభుత్వ జూనియర్ కళాశాల
సూర్యాపేట
చరవాణి: 9493755741

## కోదాడకు పోటెత్తిన యువత..
## మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన






**– 32 వేల మందికి పైగా నమోదు.. 350 కంపెనీల్లో 5,620 మంది షార్ట్‌లిస్ట్**

**– తొలి రెండు గంటల్లోనే 700 మందికి ఉద్యోగాలు.. 3,500 మందికి పైగా కొలువులు దక్కే అవకాశం**

**సూర్యాపేట / కోదాడ ప్రతినిధి, సెప్టెంబర్ 19 (సూర్య సేన) :** కోదాడ పట్టణం శనివారం మెగా జాబ్ మేళాకు తరలివచ్చిన వేలాది మంది యువతతో కిక్కిరిసిపోయింది. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఉద్యోగార్థులు తరలిరావడంతో పట్టణంలో సందడి నెలకొంది. వివిధ రంగాలకు చెందిన సుమారు 350 కంపెనీలు పాల్గొన్న ఈ భారీ నియామక కార్యక్రమంలో 5,620 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు షార్ట్‌లిస్ట్ కాగా, 3,500 మందికి పైగా ఉద్యోగాలు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. జాబ్ మేళాకు ముందుగానే 22 వేల మందికి పైగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా, కార్యక్రమ ప్రాంగణంలో మరో 10 వేల మందికి పైగా పేర్లు నమోదు చేసుకున్నారు. దీంతో మొత్తం నమోదు చేసుకున్న వారి సంఖ్య 32 వేలు దాటింది. గ్రామీణ ప్రాంతంలో నిర్వహించిన భారీ నియామక కార్యక్రమాల్లో కోదాడ మెగా జాబ్ మేళా ఒకటిగా నిలిచింది. జాబ్ మేళా ప్రారంభమైన తొలి రెండు గంటల్లోనే 700 మందికి పైగా యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

రోజంతా ఎంపిక ప్రక్రియ కొనసాగడంతో మరింతమంది యువతకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. సమాచార సాంకేతికత, ఔషధ తయారీ, ఉత్పత్తి రంగం, విమానయానం, మౌలిక సదుపాయాలు, వైద్యం, బ్యాంకింగ్, చిల్లర వ్యాపారం తదితర రంగాలకు చెందిన సుమారు 350 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయి. ఫాక్స్‌కాన్, ఎల్‌అండ్‌టీ, ఎంఐఎల్, మహీంద్రా, టాటా, అరవింద్, ఎంఎస్ఎన్, మెట్రో, గూగుల్, ఇండిగో, అపోలో, మెడ్‌ప్లస్‌తోపాటు పలు ప్రముఖ సంస్థలు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముందుకొచ్చాయి. ఉద్యోగార్థులు తమ అర్హతలకు అనుగుణమైన అవకాశాలను సులభంగా గుర్తించేలా జాబ్ మేళా ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అధికారిక వెబ్‌సైట్‌లోనూ పాల్గొన్న సంస్థల వివరాలు, గుర్తులను అందుబాటులో ఉంచారు. ఎల్‌అండ్‌టీ సంస్థ 40 మంది యువతను ఎంపిక చేసి నెలకు సగటున రూ.21 వేల వేతనం అందించనున్నట్లు తెలిపింది. ఇతర సంస్థలు



కూడా సాంకేతిక, సాంకేతికేతర ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేశాయి. విమానయానం, అనుబంధ సేవల రంగాల్లో ఉద్యోగాలు పొందేందుకు ఈ ప్రాంత యువత నైపుణ్యాలను పెంచేలా మరిన్ని శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఇండిగో సంస్థ ప్రతినిధులు సూచించారు. తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి జాబ్ మేళాను సందర్శించారు. కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగార్థులు, ఎంపికైన అభ్యర్థులతో మాట్లాడి ఉద్యోగాలు సాధించిన యువతకు నియామక పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మెగా జాబ్ మేళాకు లభించిన అపూర్వ స్పందన తెలంగాణ గ్రామీణ యువతలోని ఆకాంక్షలకు, ప్రతిభకు నిదర్శనమన్నారు. అర్హత కలిగిన ఉద్యోగార్థులు, ప్రముఖ సంస్థల మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, ఉద్యోగ అవకాశాలను యువతకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం నుంచే జాబ్ మేళా ప్రాంగణం యువతతో కిక్కిరిసిపోయింది. అభ్యర్థులు తమ విద్యార్హతలకు అనుగుణంగా వివిధ సంస్థల వద్ద దరఖాస్తు చేసుకుని పరీక్షలు, ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఒకే అభ్యర్థి పలు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను పరిశీలించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ రంగాలకు సంబంధించిన ఎంపిక, షార్ట్‌లిస్టింగ్ ప్రక్రియ రోజంతా కొనసాగింది. సంస్థల ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఉద్యోగాలు పొందే అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు

## భక్తిశ్రద్ధలతో గణేష్ శోభాయాత్ర...

నల్గొండ ప్రతినిధి, సెప్టెంబర్ 19 (సూర్య సేన): గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గణనాథుడి శోభాయాత్రను నల్గొండ పట్టణంలోనిఎల్ పి టి మార్కెట్ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, హారతులు నిర్వహించిన అనంతరం గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి శోభాయాత్రగా తీసుకెళ్లారు. శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేశారు. డప్పు వాయిద్యాలు, భక్తి గీతాలు, యువత నృత్యాలతో పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. మార్కెట్ షాప్ యాజమానులు, మహిళలు, చిన్నారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు



# వికసిత్ భారత్‌లో తెలంగాణ కీలకం

**హైదరాబాద్, సెప్టెంబర్, 19 (సూర్యసేన ప్రతినిధి):** వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో న్యూఢిల్లీలో జరిగిన వికసిత్ భారత్ దిశగా భారతదేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ సదస్సులో శనివారం డిప్యూటీ సిఎం ప్రసంగించారు. దేశం నిర్దేశించుకున్న భారీ ఆర్థిక లక్ష్యాలను సుదూర ఆశయాలుగా కాకుండా, తక్షణ కార్యాచరణ బాధ్యతగా తెలంగాణ భావిస్తోందని పేర్కొన్నారు. దేశం కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధిని సాధించేందుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకుంటూనే, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడం, ఉత్పాదకతను పెంచడం, అభివృద్ధి ఫలాలను ప్రతి పౌరుడికి, ప్రతి ప్రాంతానికి అందించడం ప్రధాన సవాలని భట్టి విక్రమార్క అన్నారు. వికసిత్ భారత్ నిర్మాణాన్ని కేంద్రం లేదా రాష్ట్రాలు విడివిడిగా సాధించలేవని, సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం–, రాష్ట్రాలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ వనరులను సమర్థంగా సమీకరించడంతో పాటు బలమైన సంస్థలు, పరస్పర సహకార విధానాలు అవసరమన్నారు. తెలంగాణ కేవలం నిధులను కోరేందుకు కాకుండా, స్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణకు నిర్దిష్ట విధానం, దీర్ఘకాలిక లక్ష్యంతో ఈ చర్చలో భాగస్వామ్యమవుతోందని స్పష్టం చేశారు.

తెలంగాణ బలమైన ఆర్థిక పునాదులతో తదుపరి దశ వృద్ధికి సిద్ధంగా ఉందని డిప్యూటీ సిఎం తెలిపారు. 2025, –26లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జిఎస్‌డిపి) రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, ప్రస్తుత ధరల ప్రకారం 10.7 శాతం వృద్ధి నమోదైందన్నారు. స్థిర ధరల ప్రకారం వాస్తవ జిఎస్‌డిపి వృద్ధి 8.5 శాతంగా అంచనా వేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర తలసరి

ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది జాతీయ సగటు రూ.2,19,575తో పోలిస్తే దాదాపు రెండింతలని వివరించారు. సేవల



రంగం 13.5 శాతం, ద్వితీయ రంగం 9.4 శాతం వృద్ధి సాధించాయని తెలిపారు. ప్రస్తుత వృద్ధి పథంలో కొనసాగితే 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ 1.21 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా ఉందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం అంతకంటే పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకుందని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను త్రీ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించామని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న దాదాపు 5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలన్నది లక్ష్యమని తెలిపారు.

నిధులు సమకూర్చుకునే క్రమంలో రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల కోసం ప్రభుత్వ రుణాలపైనే అధికంగా ఆధారపడే పద్ధతి నుంచి క్రమంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్ పెట్టుబడులు, సంస్థాగత నిధులు, సావరిన్ ఫండ్స్ నుంచి అధిక మొత్తంలో పెట్టుబడులను సమీకరించి, ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగించే నమూనా వైపు తెలంగాణ అడుగులు వేస్తోందన్నారు.



## ఈ 8 అలవాట్లే మీ మోకాళ్లను నెమ్మదిగా దెబ్బతీస్తున్నాయి!

మోకాళ్లు మన శరీర బరువును మోస్తూ రోజంతా పనిచేస్తుంటాయి. నడవడం, మెట్లు ఎక్కడం, కూర్చోవడం, లేవడం.. ఇలా ప్రతి కదలికలోనూ వాటి పాత్ర ఉంటుంది. వయసు పెరగడం, గాయాలు మాత్రమే మోకాళ్ల సమస్యలకు కారణం కాదు. మనం రోజూ చేసే కొన్ని చిన్న అలవాట్లు కూడా మోకాళ్లపై అదనపు ఒత్తిడిని పెంచవచ్చు. ఎక్కువసేపు కదలకుండా కూర్చోవడం, వ్యాయామం విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, తప్పుగా వ్యాయామాలు చేయడం వంటివి క్రమంగా కీళ్లలో బిగుతు, కండరాల బలహీనత, అసౌకర్యానికి దారితీయవచ్చు. అయితే ఈ అలవాట్లు తప్పనిసరిగా మోకాళ్లను దెబ్బతీస్తాయని కాదు. కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా కీళ్ల ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చు. ఎక్కువసేపు కూర్చోవడం: గంటల తరబడి కదలకుండా కూర్చుంటే మోకాళ్లకు అండగా ఉండే తొడ, నడుము కండరాలు బలహీనపడవచ్చు. మధ్య మధ్యలో లేచి కొద్దిసేపు నడవడం లేదా కాళ్లను కదిలించడం మంచిది. అతిగా మెట్లు ఎక్కడం: మెట్లు ఎక్కడం మంచి వ్యాయామమే. కానీ సరైన బలం లేకుండా పదేపదే ఎక్కువ మెట్లు ఎక్కడం మోకాళ్లపై ఒత్తిడిని పెంచవచ్చు. వార్మప్ లేకుండా వ్యాయామం: ఒక్కసారిగా పరుగు, జంపింగ్, స్క్వాట్స్ వంటి వ్యాయామాలు ప్రారంభించడం కండరాలు, కీళ్లపై అదనపు ఒత్తిడిని కలిగించవచ్చు. ముందుగా కొన్ని నిమిషాలు తేలికపాటి కదలికలు చేయాలి. నొప్పిని పట్టించుకోకపోవడం: వ్యాయామం సమయంలో మోకాళ్లలో నొప్పి వస్తున్నా అలాగే కొనసాగించడం సమస్యను మరింత పెంచవచ్చు. నొప్పి పదేపదే వస్తే వ్యాయామ తీవ్రత తగ్గించి వైద్య నిపుణుడిని సంప్రదించాలి. సరైన సపోర్ట్ లేని షూ: సరిగ్గా సరిపోని లేదా తగిన సపోర్ట్ ఇవ్వని చెప్పులు నడిచే విధానాన్ని ప్రభావితం చేయవచ్చు. ముఖ్యంగా ఎక్కువసేపు నడిచేటప్పుడు లేదా వ్యాయామం చేసేటప్పుడు సౌకర్యవంతమైన షూ ఎంచుకోవాలి.

వ్యాయామం పూర్తిగా మానేయడం: అతిగా వ్యాయామం చేయడం ఎంత సమస్యో, అసలు శారీరక శ్రమ లేకపోవడం కూడా అంతే మంచిది కాదు. నడక, సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి తక్కువ ప్రభావం కలిగించే వ్యాయామాలు కండరాల బలాన్ని, కదలికను కొనసాగించడంలో సహాయపడతాయి.

అధిక బరువు: శరీర బరువు పెరిగితే మోకాళ్లపై పడే భారం కూడా పెరుగుతుంది. దీర్ఘకాలంలో ఇది మోకాళ్ల నొప్పి, ఆస్టియో ఆర్థరైటిస్ వంటి సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంది. బరువు తగ్గాలంటే సమతుల ఆహారం, క్రమమైన శారీరక శ్రమపై దృష్టిపెట్టాలి.

స్క్వాట్స్, వెయిట్ లిఫ్టింగ్‌లో తప్పు పద్ధతి: తప్పుగా స్క్వాట్స్, లంజెస్ లేదా బరువులు ఎత్తడం వల్ల మోకాళ్లపై అనవసరమైన ఒత్తిడి పడవచ్చు. బరువు పెంచే ముందు సరైన పద్ధతిని నేర్చుకోవడం ముఖ్యం.

మోకాళ్లలో నొప్పి నిరంతరం కొనసాగితే లేదా క్రమంగా పెరుగుతుంటే స్వయంగా వ్యాయామాలు కొనసాగించకుండా వైద్య నిపుణుడిని సంప్రదించడం మంచిది.

# ఆనందంగా ఉండాలనుకుంటున్నారా ?



మంచిదే ఇన్నాళ్ళకు మంచి ఆలోచన వచ్చింది.... మన ఇల్లు శుభ్రంగా, అందంగా, ప్రశాంతంగా ఉండాలను కుంటే మనం ఏమి చేయాలి. ఇంటికి పట్టిన బూజు, చెత్త, చెదారం తొలగించాలి. ఇంట్లో సామాన్లు అన్ని ఒక పద్ధతి లొ ఉంచాలి. పనికి రాని వస్తువులు, ఇంట్లో అడ్డంగా ఉపయోగం లేకుండా ఉన్న వస్తువులు బయట పడేయాలి అంతే కదా.మరి మనం ఆనందంగా ఉండాలంటే చేయవలసినది అదే. ముందు ఇప్ప టికే మన మనస్సుల్లో ఉన్న చెత్త.. మన ప్రవర్తనలో ఉన్న చెడు అలవాట్లు జాగ్రత్తగా నేర్పుగా ఓర్పుగా అవతల పారే యాలి. ఆనందంగా ఉండాలంటే మనలో తొలగించు కోవలసిన మరియు వదిలించుకో వలసిన ఈ చెత్త ఏమిటో చూద్దాం.

**1.పనికిమాలిన ఇబ్బంది పెడుతున్న బంధాలను, బంధుత్వాలను మనసులోంచి బయటపడేయండి**

అదేమిటండి? అంత మాట అనేసారని మీకు అనిపించ వచ్చు. కాని తప్పదు . మనకు చికాకులు తెప్పిస్తూ మన ఆనందాన్ని హరించి వేస్తూన బంధాలు..స్నేహాలు మనసు లోంచి బయట పడేయండి. ఎంతకు మారని వారి ని మారు తారని ప్రయత్నించడం... మనం ఎంత సర్దుకు పోతున్న మన గురించి నలుగురికి చెడు ప్రచారం చేసే వారిని పట్టుకొని వేలాడటం వలన మన ఆనందం ఆవిరై పోతుం టుంది. మన కన్నా మనకి ఎవరూ ముఖ్యం కాదు..అటువంటి వారు ఫేస్ బుక్ స్నేహితులైన, వాస్తవ ప్రపంచంలోని స్నేహితులైన, బంధువులైన, రాబందువులైన జాగ్రత్త గా పరిశీలించి ఒకటికి రెండు సార్లు ఆలోచించి సెలెక్ట్ చేసి డిలిట్ బటన్ నొక్కండి.. ఆనందాన్ని కాపాడుకోండి.

**2. ఒత్తిడికి దూరంగా ఉండండి**

జీవితం ప్రెషర్ కుకర్ కాదు. ప్రతీ చిన్న విషయానికి పెద్ద విషయానికి తీవ్ర ఒత్తిడికి లోనవడానికి.. ఒత్తిడికి లోనైతే ఆనందమే కాదు ఆరోగ్యం కూడా అటక ఎక్కు తుంది. మనం ముందు ఉంటేనే కదా... ఆయా పనులు అయ్యేవి లేనివి చూడటానికి... జరిగేవి ఎలాగు జరగక మానవు... కాబట్టి ప్రతీ విషయానికి తీవ్రంగా స్పందించి ఒత్తిడి తెచ్చుకొనే తత్వాన్ని వీలైనంత త్వరలో తుడిచి అవతల పారేయండి.

**3. ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ఇబ్బంది పెట్టె చెడు అలవాట్లకు స్వస్తి చెప్పండి:**

అతి నిద్ర కాని, బద్ధకం గాని, సోమరితనం గాని, అతి స్నేహాలు గాని, ఫేస్ బుక్ గాని, చాటింగ్ కాని, బాతా ఖానీలు గాని , విండో షాపింగ్ కాని , ఇలా ఏవైనా మీకు ఇబ్బంది పెడుతూన అలవాట్లు తాత్కాలికంగా మీకు ఆనందం కలిగిస్తున్న శాశ్వతంగా తీవ్ర ఇబంది కలిగించవచ్చు. కాబట్టి ఇలాంటి చెడు అలవాట్లు ఏమిటో గుర్తించి ఫినాయిల్ వేసి కడిగి అవతల పారేయండి.

**4.ప్రతి ఒక్కరినీ సంతృప్తి పరచాలని ప్రయత్నించకండి:**

భగవంతుడు ఈ జీవితాన్ని మనకి కానుకగా ఇచ్చాడు. ఆన ందంగా జీవిస్తూ నలుగురినీ ఆనందంగా ఉంచడం మంచిదే కాని అందరినీ సంతృప్తి పరచడం వలన మనం ఆనందంగా ఉంటాం అనుకోవడం కన్నా మూర్ఖ త్వం మరొ కటి ఉండదు. ఆత్మ సంతృప్తిని మించిన ఆనందం ఎక్కడా ఉండదు. కాబట్టి ప్రతిఒక్కరిని ఆఖరికి ఇంట్లో పని మనిషిని, వాచ్‌మేన్‌ని ఆఫీస్‌లో బాస్‌ని, కొలీగ్స్‌ని, బంధువుల్ని అందరినీ సంతృప్తి పరుస్తూ జీవించాలనే మీ మహాయజ్ఞం మీద చన్నీళ్ళు పోసి హాయిగా ఉండండి.

**5.ఎవరో అపార్థం చేసుకున్నారు సరిగా అర్థం చేసుకోలేదు అనే భావాన్ని విడిచి పెట్టండి:**

ఉదాహరణకి మీరు కొరియా లేదా జపాన్ సినిమా చూసారు .. మీకు ఒక్క ముక్క అర్థం కాలేదు. అది ఎవరి తప్పు ఆ సినిమా డైరెక్టర్ దా, హీరో దా, లేదా ఆ సినిమా ఆడుతున్న థియేటర్ దా? ఆభాష రాకుండా చూసిన మనదే కదా ! అంటే ఎవరో గాడిద మనల్ని సరిగా అర్థం చేసుకోలేక ఓండ్ర పెడుతుంటే ఆ తప్పు ఎవరిదీ. అదేం టండి గాడిద అనేసారు అంటారా ? సారీ గాడిదను అవ మాన పరిచినందుకు వాళ్లకు మనం అర్థం కాక పొతే మంచి డిక్షనరీ కొనుక్కొని నేర్చుకోమనండి. ఎవరో అపార్థం చేసుకున్నారని ముక్కు చీదు కొని ఏడుపు మొదలెట్టవద్దు. ముందు మొహం కడుక్కొని అద్దంలో మీ ముఖారవిందాన్ని ఆనందించండి..

**6. ఎవరిని అనవసరంగా అనుకరించవద్దు**

మీరు మీరే... ఎవరి నుండైనా ప్రేరణ పొందండి తప్పు లేదు కాని పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు గుడ్డిగా ఎవరినీ అనుకరించడానికి ప్రయత్నించవద్దు. ఎందువలన అంటే ఒకరిని అనుసరించాలని లేదా ఒకరిలా ఉండాలని ప్రయత్నిస్తే అది లేనిపోనీ తల నొప్పులకు దారి తీస్తుంది. అనుకరణ వేరు అనుసరణ వేరు, అనుకరణ అనేది మూర్ఖ త్వం మన వ్యక్తిత్వాన్ని ,అస్తిత్వాన్ని దెబ్బతీస్తుంది. అనుసరణ మన వ్యక్తిత్వానికి కొత్త సొగసులు అద్దుతుంది. మనం మనలా ఉండటంలో ఆనందం. మనలను మనంగా స్వీకరించడంలో ఉన్న ఆత్మ సంతృప్తి దేనిలోనూ ఉండదు.

**7.ఎవరిని విపరీతంగా ద్వేషించవద్దు అలా అని ఎవరిని విపరీతంగా ప్రేమించవద్దు:**

అతి సర్వత్రా వర్జయేత్ ..ద్వేషం అనర్థదాయకం. ఎవరు పూర్తిగా మంచివారు ఉండరు అలా అని పూర్తిగా చెడ్డవారు ఉండరు. పరిస్థితులు బట్టి వారి అవసరాల బట్టి వారి హొదా బట్టి వారి పరిస్థితి బట్టి రకరకాలు గా మారుతుంటారు... శాశ్వత స్నేహితులు ఉండరు. శాశ్వత శత్రువులు ఉండరు. అతిగా ప్రేమించడం వలన దానికి మించిన శోకానికి బాధకు గురికావాలి. అతిగా ద్వేషించడం వలన అనారోగ్యం కోరి తెచ్చుకోవలసి వస్తుంది. ఈ మహా ప్రయాణంలో తోటి ప్రయాణికులు వస్తుంటారు.. పోతుంటారు..బంధాల బంధనాలతో స్వేచ్ఛను హరించు కోవద్దు. ఆనందాన్ని ఆవిరి చేసుకోవద్దు.

**8.జరిగిపోయిన దానికి, జరగబోయే దానికి ప్రాధాన్యత ఇవ్వవద్దు.**

మన ఆనందాన్ని హరించేవి గతం గురించి పశ్చాతాపం మరియు భవిష్యత్తు గురించి ఆందోళన. మన ఆలోచనల్లో 65 శాతం గతం గురించి 30శాతం భవిష్యత్తు గురించి ఉంటా యట. అంటే కేవలం 5శాతం వర్తమానం గురించి ఆలోచి స్తామన్నమాట. చిన్న పిల్లలు ఎప్పుడు ఆనందంగా ఉండటానికి కారణం ఏమిటంటే నూటికి నూరు పాళ్ళు వారు వర్తమానంలొ జీవిస్తారట. ది పవర్ ఆఫ్ నౌ అనే పుస్తకంలో ఎకార్ట్ టాలి వర్తమానంలో జీవించే వారికి ఆనందం వెంటే ఉంటుందని వివరిస్తాడు.

**9.ఎప్పుడు తమ గొప్పలు చెప్పుకుంటూ , మనల్ని కించ పరుస్తూ, మనల్ని తక్కువ చేసే మాటలాడే వారికి దూరంగా ఉండండి**

మన స్నేహితుల్లో గాని బంధువుల్లో గాని కొద్ది మంది తమను తాము గొప్ప వారిగా భావించుకుంటూ నిత్యం స్వోత్కర్ష లతో సోది వేయడమే కాకుండా మనల్ని బాగా తక్కువ చేసి మాట్లాడుతుంటారు....తామేదో అంతర్జా తీయ స్థాయిలో ఉన్నట్టు మనమేదో గల్లీ కి పరిమితం అయ్యే టట్టు మాట్లాడుతారు..మీరు చేయాల్సిన పని ఏమిటంటే మార్కెట్‌కి వెళ్లి ఒక మంచి అద్దం కొని వారికి బహుమతిగా ఇచ్చి ఒకసారి తమ సౌందర్యాన్ని తనివితీరా చూసుకోమని ఒక సలహా ఇచ్చి వారి స్నేహానికి శాశ్వతంగా సెలవు చెప్పండి.

**10.పెద్దపెద్దకోరికలు పెద్దపెద్ద కలలు కనడం మానకండి**

కోరిక, ఆశ అనేది మన జీవితంలో చైతన్యాన్ని తెస్తుంది. కలలు కనడం ఆ కలలను సాకారం చేసుకోవడంలో ఉన్న సంతృప్తి వేరు. పెద్ద పెద్ద కలలు మన ఆత్మా విశ్వాసానికి ఆత్మ ఔన్నత్వానికి నిదర్శనం. ఎట్టి పరిస్థితుల్లో మనం ఒకరి కన్నా తక్కువ అనే భావాన్ని మన వలన పెద్ద పెద్ద విష యాలు సాధ్యం కాదు అనే భావనలను ప్రక్కన పెట్టి నిత్యం ఆనందాన్ని వెతుక్కుంటూ మన ఆనందాన్ని దూరం చేసే వాటిని దూరంగా పెడుతూ జీవితంలో ప్రతీ క్షణాన్ని ఆనందించండి. ఆ ఆనందాన్ని నలుగురికి పంచండి.

# పాత రోజులు గుర్తొస్తున్నాయ్.. పల్లెల్లో 'ఇరుముడి' పండగ.. టూరింగ్ టాకీస్‌ను గుర్తుచేస్తున్న రవితేజ సినిమా!

**రవితేజ 'ఇరుముడి' చిత్రానికి అపూర్వ ఆదరణ – నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్నా వీధుల్లో సామూహిక వీక్షణ**

**పాతకాలపు టూరింగ్ టాకీస్ అనుభూతిని గుర్తుచేస్తున్న దృశ్యాలు – గ్రామాల్లో ప్రొజెక్టర్లు, పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేసి చూస్తున్న ప్రజలు**



మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' చిత్రం థియేటర్లలో చారిత్రక విజయం సాధించడమే కాకుండా ఇప్పుడు ఓటీటీ వేదికగా సరికొత్త సాంస్కృతిక ప్రభంజనం సృష్టిస్తోంది. నిన్నటి నుంచి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. సాధారణంగా ఓటీటీలో సినిమా వస్తే ప్రేక్షకులు తమ ఇళ్లకే పరిమితమై చూస్తుంటారు.

కానీ 'ఇరుముడి' విషయంలో గ్రామీణ ప్రాంతాల్లో అపూర్వ దృశ్యం ఆవిష్కృతమవుతోంది. పల్లెల్లోని ప్రజలు పాతకాలపు టూరింగ్ టాకీస్ లేదా బయోస్కోప్‌లను గుర్తుచేస్తూ, సామూహికంగా ఈ చిత్రాన్ని వీక్షిస్తూ సంబరాలు చేసుకుంటున్నారు.

గ్రామ కూడళ్లలో, గల్లీల్లోని గణేశ్ నవరాత్రి ఉత్సవాల మండపాల వద్ద స్థానికులు పెద్ద టీవీ స్క్రీన్లు, ప్రొజెక్టర్లను ఏర్పాటు చేసుకుని ఊరంతా ఒకేచోట చేరి ఈ సినిమా చూస్తున్నారు. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ కలిసి నేలపై కూర్చుని సినిమాను ఆస్వాదిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ముఖ్యంగా 'ఇరుముడి కట్టు', 'మల్లెపూల పల్లకి' వంటి పాటలు వచ్చినప్పుడు ప్రేక్షకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తున్నారు. అలాగే, తండ్రీకూతుళ్ల మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలు, క్లైమాక్స్ చూసి కంటతడి పెడుతున్న వీడియోలు ఈ సినిమా ప్రజల హృదయాలను ఎంతలా హత్తుకుందో తెలియజేస్తున్నాయి.

దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన ఈ చిత్రంలో తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధంతో పాటు అయ్యప్ప స్వామి దీక్ష నేపథ్యం ఉండటంతో కుటుంబ ప్రేక్షకులు, ముఖ్యంగా గ్రామీణ జనం బ్రహ్మరథం పట్టారు. థియేటర్లకు పల్లెల నుంచి ప్రజలు ట్రాక్టర్లలో తరలివచ్చి సినిమా చూడటం విశేషం. బాక్సాఫీస్ వద్ద రూ. 250 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు రాబట్టి, అత్యధిక ప్రేక్షకుల సంఖ్యను నమోదు చేసిన చిత్రంగా రికార్డు సృష్టించింది.

థియేటర్లలో ఒక క్లాసిక్‌గా నిలిచిన 'ఇరుముడి', ఇప్పుడు ఓటీటీ ద్వారా పల్లె వీధుల్లో పండగ వాతావరణాన్ని నింపింది. ఒకప్పుడు ఊరంతా కలిసి సినిమా చూసిన మధుర జ్ఞాపకాలను మరోసారి గుర్తుచేస్తూ, కేవలం వినోద చిత్రంగానే కాకుండా ఒక సామూహిక వేడుకగా నిలిచిపోయింది.



## కరవులో రైతాంగం.. దోపిడీలో కూటమి ప్రభుత్వం: పేర్ని నాని

**తప్పుడు హామీలతో ప్రజలను నమ్మించి కూటమి అధికారంలోకి వచ్చిందంటూ పేర్ని నాని ధ్వజం**

**సూపర్ సిక్స్ హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని విమర్శ**

**ప్రజల నుంచి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరిక**

విజయవాడ, :అధికార పీఠం ఎక్కేందుకు ఊహాజనిత హామీలతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పూర్తిగా పక్కనబెట్టేసిందని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు అందక, సరైన ప్రణాళికలు లేక కరవు కోరల్లో చిక్కుకుని రైతాంగం అల్లాడిపోతుంటే... కూటమి నాయకులు మాత్రం పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని దోచుకోవడంలో నిమగ్నమయ్యారని ధ్వజమెత్తారు. గతంలో జగన్ అందించిన పారదర్శక సంక్షేమ పథకాల కంటే మిన్నగా పథకాలు ఇస్తామంటూ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు ఇప్పుడు ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ అశాస్త్రీయ విధానాలు, మోసపూరిత వైఖరిపై నియోజకవర్గాల వారీగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో బాధితులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని గుర్తుచేశారు. ఈ ప్రజాగ్రహం నుంచి తప్పించుకునేందుకే కూటమి నాయకత్వం ప్రతిరోజూ కొత్త నాటకాలకు తెరలేపుతోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పేర్ని నాని హెచ్చరించారు.

# 'కర్మాఖ్య' (జియో హాట్ స్టార్) మూవీ రివ్యూ!

అభినయ కృష్ణ .. 'అదిరే అభి'గా ప్రేక్షకులకు తెలుసు. 'జబర్దస్త్' వేదిక ద్వారా మంచి పేరు సంపాదించుకున్న ఆర్టిస్టులలో అదిరే అభి ఒకరు. దర్శకుడిగా ఆయన ఇంతకుముందు 'చిరంజీవ' అనే ఒక సినిమా చేశారు. ఆ తరువాత సినిమాగా చేసినదే 'కర్మాఖ్య'. మిస్టీరియస్ థ్రిల్లర్ గా ఆయన చేసిన ఈ సినిమా, జులై 31వ తేదీన థియేటర్లకు వచ్చింది. 'సమైరా' ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమా, ఈ రోజు (సెప్టెంబర్ 18) నుంచి 'జియో హాట్ స్టార్' లో స్ట్రీమింగ్ అవుతోంది.



'కామాఖ్య' (సమైరా) చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోతుంది. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ లో ఉంటూ జాబ్ కోసం ట్రై చేస్తూ ఉంటుంది. 'ప్రవల్లిక' (శరణ్య ప్రదీప్) ఆమె రూమ్మేట్. ఇద్దరి మధ్య మంచి స్నేహం ఉంటుంది. ప్రవల్లిక ఒక ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తూ ఉంటుంది. ఒక రోజున ప్రవల్లికకి ఒక ఫంక్షన్ ఉండటంతో, ఆమె చేయవలసిన ఒక పాలసీ పనిమీద కామాఖ్యను పంపిస్తుంది.

అది 'విశాఖ'లోని సరోజిని (అభిరామి) ప్రభాకర్ (ఆనంద్) ఇల్లు. చనిపోయిన వారి కూతురు 'ప్రజ్ఞ' చేసిన పాలసీ గురించి మాట్లాడటానికి కామాఖ్య వెళుతుంది. వారి కొడుకు సాత్విక్ ( వైష్ణవ్)కి మానసిక స్థితి సరిగ్గా లేదనే విషయం, వెళ్లిన కాసేపటికే కామాఖ్యకి అర్థమవుతుంది. సరోజని దంపతులు ఎంతో ఆత్మీయంగా కామాఖ్యను పలకరిస్తారు. భోజనం చేసి వెళ్లవలసిందేనని పట్టుపడతారు. దాంతో మొహమాటంతో అక్కడ ఆమె భోజనం చేస్తుంది. ఆ వెంటనే ఆమె కళ్లు తిరిగి పడిపోతుంది.

ఆ దంపతులు కామాఖ్యను ఒక గదిలో బంధిస్తారు. 10 నెలల క్రితం చనిపోయిన 'ప్రజ్ఞ' బాడీ ఆ గదిలోనే ఉండటం చూసి కామాఖ్య భయపడిపోతుంది. ఆమెను 'బలి' ఇచ్చి తమ కూతురును బ్రతికించుకోవాలని అనుకుంటున్నట్టుగా సరోజినీ చెప్పడంతో కామాఖ్య భయపడిపోతుంది. అందుకు సంబంధించిన క్షుద్రపూజలు వాళ్లు మొదలుపెడతారు. అప్పుడు కామాఖ్య ఏం చేస్తుంది? ఆమెనే ఎందుకు 'బలి' ఇవ్వాలని అనుకున్నారు? అక్కడి నుంచి ఆమె బయటపడగలుగుతుందా? అనేది మిగతా కథ.

ఆ మధ్య అందరినీ విస్తుపోయేలా చేసే ఒకటి రెండు సంఘటనలు వెలుగు చూశాయి. మళ్లీ పుడతామనే నమ్మకంతో ఒక కుటుంబం ఆత్మహత్య చేసుకుంటే, చనిపోయిన వ్యక్తిని బ్రతికించడం కోసం మరొకరు నరబలిని ఇవ్వడానికి ప్రయత్నించారు. యథార్థ సంఘటనలను ఆధారంగా చేసుకుని, ఇలాంటి ఒక మూఢ నమ్మకం చుట్టూ అల్లుకున్న కథనే ఇది.

కామాఖ్యాదేవి శక్తిపీఠం .. అక్కడ జరిగే తాంత్రిక పూజలు .. తాంత్రిక పూజలు చేసే ఒక వంశానికి చెందిన కుటుంబం ఆంధ్రకి తరలిరావడం వంటి సన్నివేశాలతో దర్శకుడు ఆరంభంలోనే ఈ కథపై ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశాడు.

ఇక ఆ తరువాత స్నేహితురాలి కోసం, మానసికస్థితి సరిగ్గాలేని ఒక ఫ్యామిలీ మధ్యలోకి కామాఖ్య అమాయకంగా అడుగుపెట్టడం .. అక్కడ చిక్కుబడటం ఆడియన్స్ లో కుతూహలాన్ని పెంచుతుంది.

కామాఖ్యను బలి ఇవ్వడానికి ఆ సైకో ఫ్యామిలీ చేసే హడావిడి .. అక్కడి నుంచి తప్పించుకోవడానికి ఆమె చేసే ప్రయత్నాలు ప్రేక్షకులలో భయాన్ని కలిగిస్తాయి. ఇక్కడే కథకి మరో ట్విస్ట్ యాడ్ అవుతుంది. దాంతో అక్కడి నుంచి కథ మరింత పుంజుకుంటుంది. కథ ప్రీ క్లైమాక్స్ కి చేరుకుంటూ ఉండగా, పోలీస్ ఆఫీసర్ 'తిరుపతి'గా సముద్రఖని ఆ ఇంటివైపుకు వస్తాడు. లంచాలు తీసుకుంటూ ఆడుతూ పాడుతూ తన డ్యూటీ చేసుకునే అతనిని కలుపుకుంటూ కథ క్లైమాక్స్ దిశగా పరుగులు పెడుతుంది.

మొదటి నుంచి చివరి వరకూ 'అభి' ఈ కథను పట్టుగా నడిపించాడనే చెప్పాలి. కథనం ఎక్కడా సడల లేదు. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ తో ఈ సినిమాకి మరింత బలాన్ని చేకూర్చాడు. సమైరా .. శరణ్య ప్రదీప్ .. సముద్రఖని .. అభిరామి .. ఆనంద్ అనే ఈ ఐదుగురు ఆర్టిస్టులతోనే ఆయన ఈ కథను నడిపించిన తీరు .. వారి పాత్రలను మలచిన విధానం మెప్పిస్తుంది. తక్కువ బడ్జెట్‌లోనే అభి ఒక ఇంట్రెస్టింగ్ కంటెంట్ ను అందించాడని చెప్పాలి. తాంత్రిక పూజలకు సంబంధించిన నేపథ్యానికి 'కామాఖ్యాదేవి' శక్తిపీఠం ప్రస్తావన ఆసక్తికరంగానే అనిపిస్తుంది. అయితే 'కర్మాఖ్య' అనే టైటిల్ మాత్రం పలకడం దగ్గర నుంచి ఇబ్బంది పెడుతుంది. సాధారణ ప్రేక్షకులకు ఈ టైటిల్ కనెక్ట్ అవుతుందని చెప్పలేము. అలా కాకుండా తేలికైనా టైటిల్ మరేదేనా ట్రై చేసి ఉంటే బాగుండేదేమో అనిపిస్తుంది. ఇక ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఫరవాలేదనే చెప్పాలి.

**సినిమా వివరాలు**

సినిమా పేరు: కర్మాఖ్య

జానర్: మిస్టరీ, థ్రిల్లర్

విడుదల తేదీ: 2026-09-19

తారాగణం: సమీరా, సముద్రఖని, అభిరామి, ఆనంద్, శరణ్య ప్రదీప్

దర్శకుడు: అభినయ కృష్ణ

సంగీతం: జ్ఞాని

బ్యానర్: మై ఫ్లిమ్ ప్రొడక్షన్స్

సమీక్ష: పెద్దింటి

కర్మాఖ్య రేటింగ్: 5కి 2.25

# నా లుక్ కొత్తగా ఉండడానికి కారణం ఈ కథే: కేరళలో నాని 'ప్యారడైజ్' ప్రమోషన్స్

**'ప్యారడైజ్' నా కెరీర్‌లోనే చాలా స్పెషల్ సినిమా అన్న నాని**

**మమ్ముట్టి గారు ఎమోషనల్‌గా ఫోన్ చేశారని వెల్లడి**

**మలయాళ చిత్ర పరిశ్రమ నాణ్యతను ప్రశంసించిన హీరో**

**'ప్యారడైజ్' చిత్రానికి ట్రైలర్ విడుదల చేయడం లేదని స్పష్టం**

**కొత్త ప్రతిభను ప్రోత్సహించడమే నాకు అసలైన అవార్డు అని వ్యాఖ్య**



నేచురల్ స్టార్ నాని తన తాజా చిత్రం 'ప్యారడైజ్' ప్రచార కార్యక్రమాల్లో భాగంగా కేరళలో పర్యటించారు. సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో నాని పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన కెరీర్‌లోనే ఇది అత్యంత ప్రత్యేకమైన చిత్రమని, మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో కనిపిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మలయాళ చిత్ర పరిశ్రమపై ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటించగా, సీనియర్ నటుడు మోహన్ బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించారు.

'ప్యారడైజ్' సినిమా విశేషాల గురించి నాని మాట్లాడుతూ, "ఈ సినిమా ఆర్ట్ ఫిల్మ్, కమర్షియల్ ఫిల్మ్‌లకు సరైన మిశ్రమంలా ఉంటుంది. మలయాళ సినిమాల్లో ఉండే లోతైన భావోద్వేగాలు, తెలుగు ప్రేక్షకులు ఇష్టపడే థియేట్రికల్ మూమెంట్స్ రెండూ ఇందులో ఉంటాయి. నా కెరీర్‌లో ఇప్పటివరకు చేసిన చిత్రాలకు ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది. ఇందులో రానెస్, ఇంటెన్సిటీ చాలా ఎక్కువ. నా లుక్ కూడా కొత్తగా ఉండటానికి కారణం ఈ కథే" అని వివరించారు.

ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికేట్ వచ్చే అవకాశం ఉందని, అయితే త్వరలోనే కుటుంబ ప్రేక్షకుల కోసం మంచి సినిమాలు చేస్తానని హామీ ఇచ్చారు. నటుడిగా అన్ని రకాల జానర్లలో నటించాలనుకుంటున్నానని, త్వరలో 'భలే భలే మగాడివోయ్' తరహా సినిమా కూడా చేస్తానని అన్నారు.

ఈ చిత్రానికి ట్రైలర్ విడుదల చేయకపోవడంపై నాని స్పందించారు. "ప్రేక్షకులకు థియేటర్లలోనే పూర్తి సర్‌ప్రైజ్ ఇవ్వాలన్నది మా ఉద్దేశం. అందుకే ట్రైలర్ విడుదల చేయడం లేదు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇంకా జరుగుతున్నాయి. ఈ సినిమాలోని అనేక ఆశ్చర్యకరమైన అంశాలను ప్రేక్షకులు థియేటర్లలోనే అనుభూతి చెందాలి" అని పేర్కొన్నారు.

కేరళతో తనకున్న అనుబంధాన్ని, మలయాళ నటులతో స్నేహాన్ని నాని గుర్తుచేసుకున్నారు. "దుల్కర్ సల్మాన్ నాకు మంచి స్నేహితుడు. ఆయన ఎంచుకునే పాత్రలు నాకెంతో ఇష్టం. ఇక రెండు రోజుల క్రితం మమ్ముట్టి గారు చాలా ఎమోషనల్‌గా ఫోన్ చేశారు. ఆయన ప్రేమకైనా, కోపానికైనా ఫిల్టర్లు ఉండవు. తన మనవళ్లు ఈ సినిమా చూడొద్దని చెప్పానన్నారు" అని నాని వెల్లడించారు. మలయాళ చిత్ర పరిశ్రమ గురించి మాట్లాడుతూ, "తక్కువ వనరులతో అద్భుతమైన నాణ్యతతో సినిమాలు తీయడంలో వారు ముందుంటారు. వారి నుంచి ప్రతి పరిశ్రమ నేర్చుకోవాల్సింది చాలా ఉంది" అని కొనియాడారు.

సినిమా పరిశ్రమలోకి వచ్చి 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, "నేను పరిచయం చేసిన శ్రీకాంత్ ఓదెల, నాగ్ అశ్విన్ వంటి దర్శకులు తమను తాము నిరూపించుకోవడం గర్వంగా ఉంది. ఎన్ని బ్లాక్‌బస్టర్లు కొట్టినా, కొత్త ప్రతిభను ప్రోత్సహించడమే నా అతిపెద్ద అవార్డుగా భావిస్తాను" అని నాని తన మనసులోని మాటను పంచుకున్నారు.

# మగాళ్లకు పీరియడ్స్ రావాలని వెయ్యిసార్లు ప్రార్థించిన నటి

మహిళలు యుక్త వయసుకు వచ్చిన దగ్గర్నుంచి వారిని పీరియడ్స్ ఎంతగా ఇబ్బంది పెడతాయో ఆ బాధను అనుభవించే వారికి మాత్రమే తెలుస్తుంది. ఈ బాధను అర్థం చేసుకుని మహిళలకు సహకరించే మగాళ్లుంటారు. ఆ విషయాన్ని తేలిగ్గా తీసుకునే మగాళ్లూ ఉంటారు. నిజానికి ఈ టాపిక్ గురించి ఒకప్పుడు ఎవ్వరూ ఓపెన్‌గా డిస్కస్ చేసేవారు కాదు. మహిళలు తమ బాధను చెప్పుకునే వారు కూడా కాదు. కానీ ఇప్పుడు రోజులు మారాయి. పీరియడ్స్ చుట్టూ ఉన్న నిగూఢతను ఛేదించి సెలబ్రెటీలు సైతం దాని గురించి ఇంటర్వ్యూల్లో మాట్లాడుతున్నారు. ఇటీవల 'ఎపిక్' సినిమాలో ఈ టాపిక్ మీద ఒక పావుగంట పాటు సన్నివేశాలు కూడా పెట్టడం గమనార్హం. ఇదే సమయంలో సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ శ్రుతి హాసన్.. బాలీవుడ్ నటి సోహా అలీ ఖాన్‌తో కలిసి చేసిన ఒక పాడ్‌కాస్ట్‌లో పీరియడ్స్ గురించి.. అలాగే తనకున్న పీఎంఓఎస్ సమస్య-మాతృత్వంలో ఉన్న ఇబ్బంది గురించి చాలా ఓపెన్‌గా మాట్లాడింది.



తనకు 13 ఏళ్ల వయసులో పీరియడ్స్ మొదలయ్యాయని.. తొలిసారే చాలా తీవ్రమైన నొప్పితో బాధ పడ్డానని ఆమె చెప్పింది. తన తల్లి అప్పుడు తన బాధను వెంటనే గుర్తించి చాలా ప్రేమగా వ్యవహరించిందని, ఎక్కువ నొప్పి అన్నది తన నుంచే వారసత్వంగా వచ్చిందంటూ బాధ పడిందని శ్రుతి గుర్తు చేసుకుంది. తనకు పీరియడ్స్ టైంలో ఏ స్థాయిలో ఇబ్బంది ఉండేదో గుర్తు చేసుకుంటూ.. కొన్నిసార్లు స్పృహ తప్పే పరిస్థితి తలెత్తి, ఆసుపత్రిలో చేరి ఫ్లూయిడ్స్ ఎక్కించుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నట్లు ఆమె చెప్పింది.

వర్క్ టైంలో పీరియడ్స్ అంటే మరీ ఇబ్బంది అని.. ఇలాంటి సమమంలో మహిళల బాధను కొందరు మగాళ్లు అర్థం చేసుకోలేరని.. అందుకే మగాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుండని వెయ్యిసార్లైనా ప్రార్థించి ఉంటానని శ్రుతి చెప్పింది. అప్పుడే మహిళలకు పీరియడ్ టైంలో సెలవులు ఇవ్వాలని కాంట్రాక్టులు పెడతారనే ఆమె అంది.

మరోవైపు తనకున్న సమస్య వల్ల పిల్లల్ని కనే అవకాశం ఉండదని టీనేజీలోనే డాక్టర్లు చెప్పేశారని.. దీంతో తాను మాతృత్వం, పిల్లల గురించి ఎవ్వరితోనూ మాట్లాడకుండా ఉండిపోయానని. కానీ కొన్నేళ్ల ముందు ఒక వైద్యురాలు తన ఆలోచనను మార్చిందని శ్రుతి చెప్పింది. ఎగ్ ఫ్రీజింగ్ ద్వారా పిల్లల్ని కనే అవకాశం గురించి ఆమె చెప్పిందని.. అలాగే ఒక బిడ్డను దత్తత తీసుకునే అవకాశం కూడా ఉందని.. ఐతే తాను తన ద్వారానే బిడ్డను కనాలని ఆలోచిస్తున్నట్లు శ్రుతి వెల్లడించింది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com